



# విజయభాను






విశాఖపట్నం, ఆదివారం 12-05-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 210 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రపంచంలో అతిపెద్ద టెలిస్కోప్

### థర్టీమీటర్ టెలిస్కోప్

### తయారీలో భారత్ కీలక భూమిక



దిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ఆప్టికల్ టెలిస్కోప్ నిర్మాణంలో భారత్ కీలక భూమిక పోషిస్తోంది. థర్టీ మీటర్ టెలిస్కోప్ లేదా టీఎంటీగా పిలిచే ఈ భారీ టెలిస్కోప్‌ను అమెరికాలోని హవాయి మౌనకియా ప్రాంతంలో నిర్మించనున్నారు.

టెలిస్కోప్ కంట్రోల్ సిస్టమ్, సాఫ్ట్‌వేర్, పరికరాల తయారీతో భారత్‌కు పెద్ద భాగస్వామ్యం ఉందని టీఎంటీ ఇండియా అసోసియేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ తరువాయి 2లో..

## ఐటీసీ ఛైర్మన్ దేవేశ్వర్ కన్నుమూత

న్యూఢిల్లీః కార్పొరేట్ రంగానికి వైసీడీగా సుపరిచితులైన వైసీ దేవేశ్వర్ కన్నుమూశారు. భారతీయ కార్పొరేట్ చరిత్రలో ఒక దిగ్గజ కంపెనీకి సుదీర్ఘకాలం ఛైర్మన్‌గా కొనసాగిన అతికొద్ది మందిలో దేవేశ్వర్ ఒకరు. ప్రముఖ కార్పొరేట్ సంస్థ ఐటీసీ ఛైర్మన్ వైసీ దేవేశ్వర్ (72) కన్నుమూశారు. వైసీడీగా సుపరిచితులైన ఆయన శనివారం (మే 11) ఉదయం అకస్మాత్తుగా మరణించారు. గతంలో ఆయన క్యాన్సర్ వ్యాధికి చికిత్స తీసుకున్నట్లు సమాచారం. భారతీయ కార్పొరేట్ చరిత్రలో ఒక దిగ్గజ కంపెనీకి సుదీర్ఘకాలం ఛైర్మన్‌గా కొనసాగిన అతికొద్ది మందిలో దేవేశ్వర్ ఒకరు. 2017 వరకు ఆయన ఐటీసీకి సీఈవోగా పనిచేశారు. 2018 జనవరిలో ఐటీసీ ఆయణ్ని ఛైర్మన్‌గా నియమించింది. 2022 వరకు ఛైర్మన్‌గా కొనసాగించాలని నిర్ణయించింది. ఐటీ రంగానికి చేసిన సేవలకు గాను దేవేశ్వర్.. 2011లో పద్మభూషణ్ అవార్డును అందుకొన్నారు.

ఐఐటీ, ఢిల్లీలో చదివిన దేవేశ్వర్.. హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి బిజినెస్ విభాగంలో పట్టా అందుకున్నారు. దేవేశ్వర్ ఆధ్వర్యంలోనే ఐటీసీ.. ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్స్ ఫుడ్) రంగంలో అడుగుపెట్టింది. టాప్ కంపెనీగా ఎదిగింది. 1968లో ఐటీసీలో సాధారణ ఉద్యోగిగా చేరిన దేవేశ్వర్.. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదుగారు. 1996లో కంపెనీ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. దేవేశ్వర్ నేతృత్వంలో కంపెనీ బాట్ నుంచి టేకోవర్ ముప్పును తప్పించుకొంది. ఆ తర్వాత ఇక వెనక్కి తిరిగి చూడలేదు. ఎఫ్ఎంసీజీ రంగంలో అడుగుపెట్టిన తర్వాత ఐటీసీ ఆదాయం రూ.5,200 కోట్ల నుంచి రూ.51,000 కోట్లకు చేరింది. దీంతో ఏటా ఐటీసీ వాటాదారులకు 23.3 శాతం రాబడిని అందిస్తోంది. ఆ తర్వాత ఐటీసీ హోటళ్ల రంగంలోనూ ప్రవేశించింది.

వైసీ దేవేశ్వర్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి తరువాయి 2లో..

## మెకానికల్‌గా రాహుల్..

- హెలికాప్టర్ రిపేర్ చేస్తూ..
- సామూహికంగా పని చేస్తే విజయం మనదే



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్న రాహుల్‌గాంధీ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఆసక్తికర ఫొటోను షేర్ చేశారు. అందులో రాహుల్ నేలపై పడుకుని హెలికాప్టర్‌ను రిపేర్ చేస్తూ కన్పించారు. హెలికాప్టర్‌లో తరువాయి 2లో..

## పెళ్లిబృందంపాలిట తుఫాన్

- కర్నూలులో ఘోర రోడ్డు ప్రమాదం
- తుఫాన్ వాహనాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు
- 14 మంది అక్కడికక్కడే మృత్యువాత
- నుజ్జునుజ్జు అయిన వాహనం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- క్షతగాత్రులు సర్వజన ఆస్పత్రికి తరలింపు
- మృతులంతా రామవరం గ్రామస్తులే
- బస్సులోని వారికి స్వల్పగాయాలు
- ప్రమాదంపట్ల సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి



వెల్దుర్తి: కర్నూలు జిల్లా వెల్దుర్తి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు అతివేగంతో వెళ్తున్న ఎస్ఆర్ఎస్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు గద్వాల వైపు వెళ్తున్న తుఫాన్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తుఫాను వాహనంలోని 14 మంది అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వెల్దుర్తిలోని ఓ మలుపు వద్ద ఎదురుగా వస్తోన్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో డివైడర్‌ను దాటి అటువైపుగా వస్తోన్న తుఫాన్ వాహనాన్ని బస్సు బలంగా ఢీకొట్టింది. వాహనంలో 17 నుంచి 20 మందికి పైగా ఉన్నట్టు సమాచారం. 14 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. మిగతా వారు వాహనంలో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జవ్వడంతో వారిని బయటకు తీయడం ఇబ్బందిగా మారింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. తరువాయి 2లో..






## హాస్యాస్పదంగా ప్రజాస్వామ్యం

***ఎన్నికల నిర్వహణకు మూడు మాసాలా?***

***లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ***



విశాఖపట్నం: దేశంలో సార్వత్రిక ఎన్నికలను మూడేసి నెలల పాటు నిర్వహించి ఓ పెద్ద ప్రహసనంలా చేస్తున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. లక్షల మంది సైన్యం, రక్షక దళాలు ఉంటేగానీ సార్వత్రిక ఎన్నికలు జరగవనే భ్రమలను కల్పిస్తుండటంతో ప్రజాస్వామ్యం హాస్యాస్పదంగా మారిందన్నారు. కెన్యా లాంటి దేశంలో తరువాయి 2లో..

## నిర్వాసితులకు పరిహారమివ్వాలి

### మల్లన్నసాగర్‌పై కేసీఆర్ కీలక సమీక్ష



హైదరాబాద్: మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు సహాయ, పునరావాసంపై తెలంగాణ సీఎం కేసీఆర్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిభవన్‌లో ఉన్నతాధికారులతో ఆయన భేటీ అయ్యారు. నిర్వాసితులకు తగిన పరిహారం ఇవ్వాలని, సహాయ పునరావాస చర్యలు చేపట్టాలంటూ ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో సీఎం ఈ అంశంపై మరోసారి సమీక్షించారు. ఇప్పటికే యుద్ధప్రాతిపదికన పరిహార చెల్లింపు పనులు చేపట్టాలని, ఈ రోజు నాటికి (మే 11) ఈఅంశంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలంటూ సీఎం అధికారులను తరువాయి 2లో..

## భారత అమ్ములపొదిలో అపాచీ



వార్త 2వ పేజీలో..

## ఇంటర్ విద్యార్థులకు మద్దతుగా అఖిలపక్ష నేతల నిరసన

హైదరాబాద్: ఇందిరాపార్క్ వద్ద అఖిలపక్షనేతల నిరసన దీక్షలో గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ వ్యాఖ్యలతో ఘర్షణ జరిగింది. ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలను నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, వీహెచ్, తెలంగాణ తెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, తెజస అధ్యక్షుడు కోదండరామ్, వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వేదికపై కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌ఛార్జి కుంతియా కోసం ఏర్పాటు చేసిన కుర్చీలో టీపీసీసీ అధికార ప్రతినిధి నగేశ్ కూర్చునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో నగేశ్, వీహెచ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వీహెచ్ చేయి చేసుకోవడంతో నగేశ్ ఆయన చొక్కా పట్టుకున్నారు. తోపులాటలో ఇద్దరూ కిందపడిపోయారు. దీంతో అప్రమత్తమైన అఖిలపక్ష నేతలు కిందపడిపోయిన వీహెచ్‌ను పైకి లేపారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి వచ్చినప్పుడు బాధ్యతగల నాయకుడు ఇలా ప్రవర్తించడం సరికాదంటూ వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ దీక్ష చేస్తున్నప్పుడు మనలో మనకే సమన్వయం లేకపోవడం ఏంటని ధ్వజమెత్తారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అఖిలపక్ష తరువాయి 2లో..









## ఎస్పీవై రెడ్డి కుటుంబానికి పవన్ పరామర్శ



కర్నూలు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లాలోని నంద్యాల చేరుకున్నారు. గత నెల 30న కన్నుమూసిన ఎస్పీవై రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి ఎస్పీవై రెడ్డి జనసేన అభ్యర్థిగా పోటీచేసిన విషయం తెలిసిందే. అయితే, తరువాయి 2లో..




## నాతవరం బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం




నాతవరం : నాతవరంలో బస్టాండ్ వద్ద శ్రీశ్రీశ్రీ కోటమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్వాహకులు శనివారం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.

నాతవరంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్టాండ్ నందు ప్రయాణికులు దాహం తీర్చడం కొరకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అవుగడ్డి శివ కుమార్, ఇటంశెట్టి దివానం, గూడపర్తి ధనాజీ, శెట్టి గోపి, అంకంరెడ్డి రమణబాబు, పైల బుజ్జి, శ్రీకోటమ్మ తల్లి భక్తులు, యువకులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలి

### వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకరగణేష్



ఆర్డీవోతో మాట్లాడుతున్న వైసీపీ అభ్యర్థి గణేష్

నర్సీపట్నం : పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం వైసిసి అభ్యర్థి పెట్ల ఉమాశంకర గణేష్ అన్నారు. నర్సీపట్నంలో జారీ అయిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇంకా ఓటర్లకు పూర్తి స్థాయిలో చేయకపోవడంపై శనివారం నర్సీపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జారీ అయిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఓటర్లకు అందక పోవడం పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 2160 బ్యాలెట్ ఓట్లు జారీ చేయగా, ఇప్పటి వరకు కేవలం 1400 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారని, మిగతా వారికి పోస్టల్ జాప్యం కారణంగా అందలేదని తెలిపారు. దీనిపై అధికారులు చొరవ చూపి అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతే కాకుండా పోస్ట్ఆఫీస్ వద్ద కొంత మంది టీడీపీ నాయకులు బెదిరించి బ్యాలట్ ఓట్లను లాక్కొంటున్నారని, దీనిపై కూడా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారిని కోరామని తెలిపారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా అధి.కారులు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్య క్రమంలో వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, నాయకులు గవి రెడ్డి స్వామి నాయుడు, ఘట్టమనేని శ్రీనివాస రావు, కర్రి శ్రీనివాసరావు, బోడపాటి సుబ్బలక్ష్మి, సిరసపల్లి నాని, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ అప్ అండ్ డౌన్ వల్ల గృహోపకరణాల మరమ్మత్తులు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలోని 23, 26 వార్డులలో గత మూడు నాలుగు రోజుల నుంచి పవర్ అప్ అండ్ డౌన్ అవ్వడం వల్ల ఇంట్లో ఫ్యాన్లు, పలు గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆయా వార్డు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక సుమారు గంట నుంచి కరెంటు లేక పోవడంతో ఎండ తీవ్రంగా ఉండడం చేత ఉక్కపూత కారణంగా చిన్నారులు, వృద్దులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు దృష్టిసారించి ఈ కరెంటు యొక్క హెచ్చుతగ్గులను, పూర్తిగా కరెంటు లేకపోవడం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## మంచినీటి సరఫరా ట్యాంకు ప్రారంభం



మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

రోలుగుంట : వేసవిలో తాగునీటి ఇబ్బంది ఉన్న గ్రామాల్లో తాగునీటిని అందించడం అభినందనీయమని చోడవరం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామంలో వైసిపి నాయకులు, కార్యకర్తల సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్నాయన్నారు. ఇటువంటి తరుణంలో నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో వైసిపి నాయకులు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బవరపు సత్యం, గుల్లి రాజుబాబు, వర్రీ పోతురాజు, సబ్బావరపు పెద్దినాయుడు, మడ్డు అప్పల నాయుడు, గొల్లు గోవింద, కొల్లి సన్యాసనాయుడు, సబ్బవరపు సూరిదేముడు, యడ్డల లక్ష్మణ, మడ్డు నూకరాజు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓటర్ల జాబితా విడుదల

యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.సింహాచలం మున్సిపల్ ఓటర్ల జాబితాను వెల్లడించారు. మున్సిపాలిటీలో ఉన్న 24 వార్డులకు సంబంధించి ఓటర్ల జాబితాను కార్యాలయంలో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సారం ఓటర్ల జాబితానువిడుదల చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 24 వార్డుల్లోను మొత్తం ఓటర్లు 35,228 మంది. ఇందులో పురుషులు 17,125, మహిళలు 18103గా ఉన్నట్లు తెలిపారు. పురుషులు కన్నా మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 24 వార్డుల్లో కల్లా 21వ వార్డుల్లో అత్యధికంగా 2061 మంది ఓటర్లు, అత్యల్పంగా 24వ వార్డులో 1211 మంది ఓటర్లు ఉన్నారు.

# వేసవికాలంలో జంతువుల దాహన్ని తీర్చండి

### జంతు, ప్రకృతి ప్రేమికురాలు దుర్గాసురా



పరవాడ : కుమారి దుర్గాసురా అనే ఈమె ఒక ఇంజినీరింగ్ గ్రాడ్యూయట్ మరియు ఇంగ్లాండ్‌లోని వారివిక్ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబిఎ పూర్తి చేశారు. ఈమె ప్రపంచవ్యాప్తంగా టాటాకన్సెల్టెన్సెస్‌తో కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతము ఫోర్ గ్రీన్ ఒక చిన్న వ్యాపారాన్ని కూడా నడుపుతున్నారు. ఫోర్ గ్రీన్ అనేది దేశవ్యాప్తంగా సముద్రజీవులను రక్షించుట కోసము ప్లాస్టిక్‌కు ప్రత్నమ్యాయ ఇకోఫ్రెండ్లీ వస్తువులును సరఫరా చేసేది. ఈమెకు అమె కుటుంబ సభ్యులు సహాయ సహకారాలును అందజేస్తున్నారు. అశ్రయము లేని జంతువులుకు ఆహారాన్ని అందించడమే కాకుండా సమయానికి వైద్య సహాయం కూడా అందిస్తూన్నారు. ఈమె ఈమె కుటుంబసభ్యులు అందరూ కలిసి పాఠశాల విద్యార్దులకు జంతువులు దయపట్ల అవగాహన కలిగించే విద్యా కార్యక్రమాలును కూడా నిర్వహిస్తున్నారు. వీరు ఇండియా, కెనడాల్లో వున్న వివిధ జంతుపరిరక్షణ సంస్థలకు విరివిగా విరాళాలు అందిస్తున్నారు. ఈమధ్యకాలంలో అర్క్ బీచ్ లో జరిగిన అలీవ్ రెడ్లీ తాబేలును సముద్రం లోనికి విడిచిపెట్టిన కార్యక్రమంలో కూడా ఈమె పాల్గొన్నారు. వందలాది నిరాశ్ర్య జంతువులు, పక్షులు అధిక ఉష్ణోగ్రత మరియు స్వచ్ఛమైన త్రాగునీరు లేక మరణిస్తున్నాయని అన్నారు. ఈమె సెలవులకై కొన్నినెలలుపాటు బారతదేశానికి వచ్చినప్పుడు కూడా ఈమే వేసవి కాలంలో నిరాశ్ర్య వీధికుక్కలు, ఇతర నిర్రశ్య జంతువులు, పక్షులు దాహర్తినీ తీర్చడము కొసము నేడు ఉదయం పదిన్నర గంటలకువడ్లపూడినందు వివిధ ప్రాంతాల్లో సిమెంట్ కుండీలును ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామనీ, ఈ కార్యక్రమన్ని ప్రతిఒక్కరూ ప్రోత్సహిస్తూ నోరులోని మూగజీవులు పట్ల మానవత్వాన్ని చాటుకునే విధంగా కృషి చేయాలని అమె కోరారు.

# మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌లో అతి చిన్న క్యాన్సర్ కణితులకు వైద్యం





విశాఖపట్నం : మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఇన్స్టిట్యూట్ అత్యాధునిక సాంకేతిక చికిత్స విధానాన్ని ఈ ప్రాంత ప్రజలందరికీ అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్లోనే మొట్టమొదటిసారిగా ఖచ్చితమైన రేడియోథెరపీ చికిత్స స్టీరియోటాక్టిక్ చికిత్స విధానం తో సంక్లిష్టమైన అతి చిన్న క్యాన్సర్ కణితులకు ప్రత్యేకంగా అందించే వైద్య సేవలు ఇంతవరకు లేని అత్యాధునిక సాంకేతికత అనే నూతన విధానాన్ని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనితో బాటు ABC సిస్టం ద్వారా శ్వాస నియంత్రణ పద్ధతి సౌకర్యాలతో రేడియోథెరపీలో ఖచ్చితత్వాన్ని పెంచి దుష్ప్రభావాలను తగ్గిస్తుంది. సాధారణంగా మనం వినే గామానైఫ్, సైబర్నైఫ్ చికిత్స విధానం తో సరిసమానమైన చికిత్సను ఈ సరికొత్త అత్యాధునిక స్టీరియోటాక్టిక్ విధానం ద్వారా అతి చిన్న క్యాన్సర్ కణితులకు వైద్యం చేయవచ్చును. స్టీరియోటాక్టిక్ రేడియోథెరపీకు మార్గ దర్శకాలు అనే శీర్షికతో జాతీయ సదస్సు మరియు వర్క్ షాప్ ను హోటల్ పామ్ బీచ్, విశాఖపట్నం నందు మే 11, 12 న నిర్వహించుచున్నాము. ఈ సదస్సులో దేశంలోని ప్రముఖ రాష్ట్రాలలోని రేడియోథెరపీ రంగంలో నిపుణులైన మేధావులంతా సమావేశమై, ఉత్తమ విధి విధానాలను చర్చించి వాటిని ఒక పుస్తక రూపంలో ఆవిష్కరిస్తున్నాము. దీనిలోని మార్గదర్శకాలు, విధి విధానాలు రేడియోథెరపీ రంగంలో ఉన్న నిపుణులకు, భవిష్యత్తులో రాబోయే నిపుణులకు ఇది ఎంతో ఉపయోగాన్ని ఇస్తుంది.

ఈ సదస్సులో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ఘుఎజూ; రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. మురళీకృష్ణ, రాయపూర్ వేదాంత క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా. రాకేశ్ వ్యాస్ మరియు ఇతర సీనియర్ డాక్టర్లు సదస్సు ను ప్రారంభించి దీని విశిష్టత, ముఖ్య ఉద్దేశ్యం పై ప్రసంగించారు. ఈ సదస్సులో రేడియోథెరపీ నిపుణులతో పాటు న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పల్మనాలజి, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ నిపుణులు పాల్గొన్నారు. మన దేశం నలుమూలల నుండి వచ్చిన ప్రముఖ వైద్యులు వివిధ వ్యాధులకు సంబంధించిన స్టీరియోటాక్టిక్ మార్గదర్శకాల పై కీలక విధి విధానా లపై చర్చిస్తారు. ఈ సదస్సులో చివరిగా నిర్వహించే వర్క్ షాప్ స్టీరియోటాక్టిక్ రేడియోథెరపీ మరియు ఎయిర్ వే బ్రీతింగ్ కోఆర్డినేటర్(ABC) సదస్సు కే హైలైట్గా నిలుస్తుంది.

మొదటి పేజీ తరువాయి

## ప్రపంచంలో అతిపెద్ద టెలిస్కోప్

ఏఎన్ రామప్రకాశ్ ముంబయిలోని వర్లీ నెహ్రూ సైన్స్‌సెంటర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. ఈ ఏడాదిలో టెలిస్కోప్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. 2029-30 నాటికి ఇది ప్రారంభం కానుందని.. అప్పుడు ఈ విశ్వానికి సంబంధించిన అతి పెద్ద చిత్రాన్ని ఇది అందించనుందని చెప్పారు.

టెలిస్కోప్ సెన్సర్లు, యాక్యుయేటర్ల తయారీతోపాటు ఇతర సాంకేతికతలను అందించే పనిలో భారత సంస్థలు ఉన్నాయి. పుదేచ్చేరిలో సెన్సర్ల తయారీ జరుగుతోంది. యాక్సయేటర్ల తయారీ బెంగళూరులో కొనసాగుతోంది. ఇక టెలిస్కోపు కంట్రోల్ సిస్టమ్ పనులు పుణెలో జరుగుతున్నాయి అని ఆయన వివరించారు. విశ్వంలోని కొత్త ప్రాంతాలపై ఈ టెలిస్కోప్ దృష్టి సారించనుంది. నాసా హబుల్ టెలిస్కోప్ కంటే 12 రెట్ల మెరుగైన చిత్రాలను ఇది అందించనుందని టీఎంటీ అసోసియేట్ ప్రాజెక్ట్ మేనేజర్ రవీంద్ర భాటియా వెల్లడించారు.

*టీఎంటీ ప్రత్యేకతలు..*

ఈ భారీ టెలిస్కోప్‌లోని అద్దం 30 మీటర్ల వెడల్పు ఉంటుంది. అందుకే దీనికి ఈ పేరు వచ్చింది.

ప్రస్తుతం వినియోగంలో ఉన్న అతి పెద్ద ఆప్టికల్ టెలిస్కోప్‌తో పోల్చితే ఇందులో తొమ్మిది రెట్లు మెరుగ్గా కాంతిని సేకరించే వ్యవస్థ ఉంది.

అయితే ఇది అతి పెద్ద టెలిస్కోప్‌గా ఎంతో కాలం ఉండలేదు. ఎందుకంటే యూరోపియన్ దేశాలు 42 మీటర్ల ఆప్టికల్ టెలిస్కోప్‌ను నిర్మించే యోచనలో ఉన్నాయి. ఇది 2029 నాటికి పూర్తికాగలదని అంచనా వేస్తున్నారు.

## ఐటీసీ ఛైర్మన్ దేవేశ్వర్ కన్నుమూత

దేవేశ్వర్ మద్దతుగా నిలబడ్డారని కేసీఆర్ ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. దేవేశ్వర్‌తో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2015లో టీఎస్-ఐపాస్ ఆవిష్కరణ కార్యక్రమంలో దేవేశ్వర్ పాల్గొన్నారు. ఆయన మృతిపట్ల కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు.

## నిర్వాసితులకు పరిహారమివ్వాలి

ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నెల 15న మల్లన్నసాగర్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు వ్యవహారం హైకోర్టులో విచారణకు రానున్న నేపథ్యంలో చెక్కుల పంపిణీ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో అధికారులతో సమీక్షిస్తున్నారు. అయితే, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు కోసం అధికారులు ఆయా గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి పరిహారం చెల్లింపును పూర్తిచేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు చెక్కుల పంపిణీ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది? ఏయే గ్రామాల్లో ఎంతమంది నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేశారు? ఎంత మొత్తంలో పంపిణీ చేశారు? ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉన్నారా? తదితర అంశాలను సీఎం అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎస్ ఎస్కే జోషీతో పాటు సోమేశ్‌కుమార్, స్మితా సబర్వాల్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, పరిహారం పంపిణీని పూర్తిస్థాయిలో పర్యవేక్షించిన కొందరు అధికారులు పాల్గొన్నారు.

## మెకానికల్‌గా రాహుల్..

సమస్య రావడంతో తామంతా కలిసి దాన్ని సరిచేసినట్లు క్యాప్షన్‌లో పేర్కొన్నారు. టీం వర్క్‌తో ఏదైనా సాధించగలమని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో పర్యటించారు. ఆ సమయంలో ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో సమస్య తలెత్తింది. హెలికాప్టర్ సిబ్బంది దాన్ని సరిచేస్తుండగా.. రాహుల్ కూడా ఓ చేయి వేశారు. హెలికాప్టర్ కిందకు దూరి మరీ రిపేర్ చేశారు. మంచి టీం వర్క్ అంటే అన్ని చేతులు కలిసి పనిచేయడమే. ఉనా పర్యటన సమయంలో మా హెలికాప్టర్‌లో సమస్య ఎదురైంది. మేమంతా కలిసి దాన్ని త్వరగా సరిచేశాం. అదృష్టవశాత్తు ఎవరికీ ఏం కాలేదు అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ ఫొటో సోషల్‌మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే ఈ ఫొటోను 86వేల మందికి పైగా లైక్ చేశారు. గ్రేట్ సర్.. మీరు చాలా గొప్పవారు అంటూ వేల మంది కామెంట్లు చేస్తున్నారు. హిమాచల్‌లో మే 19న ఎన్నికలు జరగనున్నాయి.

## పెళ్లిబృందంపాలిట తుఫాన్

తీవ్ర గాయాలతో ఉన్న నలుగురిని చికిత్స నిమిత్తం కర్నూలు సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతులంతా గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామవరం గ్రామస్థులుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం తీవ్రత దృష్ట్యా వాహనంలో ఉన్నవారంతా మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

**పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా..**

పెళ్లి చూపులకు వెళ్లి సొంత గ్రామానికి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. వీరంతా ఒకే గ్రామానికి చెందినవారేనని.. బంధువులైనప్పటికీ.. ఒకే కుటుంబానికి చెందినవారా? కాదా అనేది తెలియాల్సి ఉంది. ఈ విషాదంతో ఎవరూ అక్కడ మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని తెలుస్తోంది. వాహనంలో ఎవరైనా కొన ఊపిరితో ఉంటే వారిని కర్నూలులోని సర్వజన ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాలను ఎక్కడికి తరలిస్తారన్న సమాచారం ఇంకా వెల్లడించలేదు. ఆధార్‌కార్డుల్లో వున్న సమాచారం ఆధారంగా వీరంతా రామాపురం గ్రామస్థులుగా పోలీసులు తేల్చారు. వీరంతా కాసేపట్లోనే కర్నూలు దాటాల్సి ఉన్న సమయంలో ఈ ఘోరం జరిగింది. బస్సులో వున్న వారిలో కొందరికి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని తెలుస్తోంది. ఎంతమందికి గాయాలయ్యాయనే విషయం తెలియాల్సి ఉంది.

**సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి**

వెల్దుర్తి రోడ్డు ప్రమాదంలో జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన పలువురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సంఘటనలో గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి అవసరమైన సాయం అందించాల్సిందిగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు.

## ఇంటర్ విద్యార్థులకు మద్దతుగా అఖిలపక్ష నేతల నిరసన

నేతలు.. వేదికపై ఉన్న నేతలంతా కిందికి దిగాలని, ఒక్కో పార్టీ నుంచి ఒక నాయకుడు మాత్రమే ఉండాలని ఆదేశించారు. సభాస్థలి చిన్నగా ఉండటంతో పాటు ఎక్కువ మంది నేతలు తరలిరావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. కోదండరాం, నారాయణ జోక్యం చేసుకుని పరిస్థితి సద్దుమణిగేలా చేశారు. కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు ఉంటే గాంధీభవన్‌లో తేల్చుకోవాలి గానీ, దీక్షా శిబిరం వద్ద ఘర్షణకు దిగడం సరికాదని వివిధ పార్టీల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఎస్పీవై రెడ్డి కుటుంబానికి పవన్ పరామర్శ

అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో నంద్యాలకు వెళ్లిన పవన్.. ఎస్పీవై రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎస్పీవై రెడ్డి మృతి చెందిన రోజు విదేశీ పర్యటనలో ఉండటంతో పవన్ రాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల, అల్లుడితో కాసేపు పవన్ మాట్లాడారు.

## హాస్యాస్పదంగా ప్రజాస్వామ్యం

ఒకేరోజులో అన్ని ఎన్నికలూ నిర్వహించి ఆ రోజు రాత్రే ఫలితాలు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చిన్న చిన్న దేశాలు ఒక్క రోజులో ఎన్నికలు నిర్వహించి ఫలితాలు ఇస్తూ ఉంటే ఇక్కడ రూ.వేల కోట్లు ఖర్చుచేసి నెలల పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉంచడం వల్ల దేశాభివృద్ధి ఆగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశంపై లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో విశాఖలో బృంద చర్చ జరిగింది. ఈ చర్చలో జేపీతో పాటు మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ, భాజపా నేత విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొని సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని తీర్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ కమిటీ వేసి కార్యాచరణను ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

## భారత అమ్ముల పొదిలో అపాచి

దిల్లీ: భారత వాయుసేన అమ్ములపొదిలోకి మరో అస్త్రం చేరింది. తొలి అపాచీ అటాక్ హెలికాప్టర్‌ను అమెరికా శనివారం అధికారికంగా భారత వైమానికదళానికి అప్పగించింది. ఈ విషయాన్ని ఐఏఎఫ్ ట్విటర్ ద్వారా వెల్లడించింది. అరిజోనాలోని బోయింగ్ ఉత్పత్తి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత వైమానిక దళం తరఫున ఎయిర్ మార్షల్ ఏఎస్ బుటోలా తొలి అపాచీని స్వీకరించారు. యూఎస్ నుంచి 22 అపాచీ హెలికాప్టర్లను కొనుగోలు చేసేందుకు 2015 సెప్టెంబరులో ఐఏఎఫ్.. అమెరికా ప్రభుత్వం, బోయింగ్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ ఏడాది జులై నాటికి తొలి విడత హెలికాప్టర్లు భారత్‌కు రానున్నాయి. భారత వాయుసేనలోకి అపాచీ హెలికాప్టర్లు రావడం ఐఏఎఫ్ హెలికాప్టర్ల ఆధునికీకరణలో కీలక ముందడుగు. వాయుసేన భవిష్యత్ అవసరాలకు ఈ హెలికాప్టర్ ఎంతో అనువైనది. అని ఐఏఎఫ్ ట్వీటర్‌లో పేర్కొంది. అపాచీ హెలికాప్టర్లకు గాలిలో, భూమి మీద దాడి చేయగల సామర్థ్యం ఉంటుంది.

# నేడు బ్రహ్మానందం రాక

విశాఖ సిటీ : ప్రముఖ సినీ హాస్య నటుడు బ్రహ్మానందం 12వ తేదీన విశాఖలో జరుగుతున్న ఢిల్లీ తెలుగు అకాడమీ కార్యక్రమానికి హాజరవుతారని అకాడమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ వి ఎల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహిస్తున్న తమ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ఆదివారం సాయంత్రం కార్యక్రమానికి బ్రహ్మానందం హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనని డి టి ఏ ఘనంగా సత్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో శారదా పీఠం స్వామిజి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, మంత్రులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు, రాజకియ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు.

# కోల్పోయిన బిడ్డను తిరిగి ఎత్తుకున్న తల్లి

## లండన్ ఐవీఎఫ్- వైజాగ్ విజయం




విశాఖ సిటీ: ఆకస్మికంగా మరణించిన తన కుమారుడు సాయి తేజ వర్మ కు పునర్జన్మ ప్రసాదించి వాస్తవ రూపంలోకి తెచ్చుకోవడానికి లండన్ ఐ వి ఎఫ్ సెంటర్ లో చేరి ఓ తల్లి తన కలను సాకారం చేసుకుంది. ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు వివరాలను తెలిపారు. విశాఖకు చెందిన దంతులూరి జ్యోతి ( 35), జగన్నాథం రాజు(43) దంపతుల కుమారుడు సాయి తేజ్ వర్మ(17) 2018 ఏప్రిల్ లో ఆకస్మికంగా మరణించాడు. ఎదుగుతున్న కుమారుని మరణం వారిని క్ృంగదీసింది. విధి వారి జీవన గమనం ఆగిపోయినట్లు చేసింది. ఒక నెల గడిచేసరికి ఆ తల్లిదండ్రులు కొంత ధైర్యం తెచ్చుకున్నారు. ఒక బిడ్డను తిరిగి పొందుటకు జగదాంబ సెంటర్ కు దగ్గరలో ఉన్న లండన్ ఐ వి ఎఫ్ సెంటర్ కు చెందిన ప్రముఖ ఐ.వి. ఎఫ్ ప్రముఖ వైద్యులు కె. చంద్రారెడ్డిని కలిసి కొడుకును పోగొట్టుకున్న తమ జీవితంలోని విషాద సంఘటనను ఆయనకు వివరించారు. మరో బిడ్డను ఎత్తుకోవడం ద్వారానే తమ గాయం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్యుల సంప్రదింపులు, సలహాలు అనంతరం సంతానోత్పత్తి చికిత్సకు సిద్ధ పడ్డారు. అయినప్పటికీ వయసు ప్రభావంతో జ్యోతి మొదటి ఐవీఎఫ్ విఫలమయింది. ఆ దంపతుల ఆశలు నీరుగారిపోయాయి. వైద్యుల సలహాలు, ప్రోత్సాహం, నిరంతర మానసిక, ఆర్థిక వత్తిడి నడుమ రెండోసారి ఐ వి ఎఫ్ వైద్య ప్రక్రియను కొనసాగించారు. ఈసారి విజయవంతంగా జ్యోతి గర్భం దాల్చడంతో ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు.

అయితే ఆ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. పెద్ద వయసు కావడంతో రక్తస్రావం కావడం, శిశువు 12 వారాలు వయసులో గర్భకోశంలో ఉమ్మనీరు సమస్య రావటం, ఇదే విషయాన్ని అల్ట్రాసౌండ్ స్కాన్ల లో నిర్ధారణ కావడంతో లండన్ ఐవిఎఫ్ సెంటర్ వైద్యులు డాక్టర్ చంద్రారెడ్డి ఒక ఛాలెంజ్‌గా తీసుకుని ఈ కేసును తన వైద్య నిరంతర పర్యవేక్షణలో ఉమ్మ నీరు గర్భంలో చేరే విధంగా చికిత్సలను అందించి ఆమె గర్భంలో ఉన్న ఉన్న శిశువుకు ప్రాణం పోశారు. ఇరవై ఆరు వారాల పరిపక్వత శిశువు ఊపిరితిత్తులు బాగా పనిచేయడానిక మెరుగైన మందులు, ఇంజక్షన్ లు ఇచ్చారు. శిశువు ఇరవై ఏడు వారాల సమయంలో తల్లికి రక్తస్రావం కావడంతో అత్యవసర సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించి 1.15 కిలోగ్రాముల మగ శిశువును తల్లి ప్రసవించే విధంగా సహకరించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా కోరుకుంటున్నారని శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ చంద్రారెడ్డి వివరించారు. సంక్లిష్టమైన కేసును విజయవంతం చేసి దంపతుల కలను సాకారం చేయడంలో గొప్ప అనుభూతిని పొందినట్లు తెలిపారు. ఈ నెల 12న మాత ృ దినోత్సవం సందర్భంగా సంతానం లేని మాత ృమూర్తుల కు ఐ వి ఎఫ్ సెంటర్లు ఒక వరంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సంతాన ఉత్పత్తి వైద్య రంగంలో ఎంతో మంది మహిళలు పిల్లలను పొందుతున్నారని ఇది ఒక గొప్ప మార్పుగా అభివర్ణించారు. సంతానం పొందిన దంపతులను మీడియాకు పరిచయం చేశారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యేక పూజలు



ములగాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని ఉద్దేశ్యంతో శనివారం గాజువాక డిపో వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో 46 వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గులివిందల కృష్ణ ఆధ్వర్యంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు గావించారు

అంతరం ఆలయం ప్రాంగణంలో100 కొబ్బరి కొట్టారు వార్డు అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన సార్వత్రిక ఫలితాలు విడుదలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అదేవిధంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మళ్ల విజయప్రసాద్ గెలవలేని ఉద్దేశ్యంతో ఈ రోజు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు గావించమని మేమే కాదు ఆంధ్ర రాష్ట్ర మంతా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారని వారికి ఎల్లవేళలా భగవంతుడు ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉద్దా భాస్కర రావు తోనంగి వెంకటరమణి కృష్ణ అప్పారావు చిన్న సత్యనారాయణ కాశి ఎల్లారావు రాజు తదితరులు పాల్గొన్నారు

# రోగాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన



భీమునిపట్నం: జివిఎంసి పరిది భీమిలి జోనల్ ఏరియా లో ఉన్న వార్డ్ లలో శనివారం మలేరియా డెంగ్యూ వంటి రోగాలు ప్రభలకుండా మాస్ సర్వేలెన్స్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో జోనల్ లెవెల్ స్పెషల్ ఆఫీసర్ బి.సన్యాసి నాయుడు ఆద్వర్యంలో జరిగింది దీనిలో జోనల్ కమీ షనర్ సిహెచ్ గోవిందరావు సిబ్బంది కలిసి వార్డుల లో ప్రజలకు మలేరియా డెంగ్యూ వంటి రోగాలు ప్రభలకుండా తీసుకోవాల్సిన చర్యలు పై ఎన్యుమరేటర్లు ద్వారాపూర్తి అవగాహన కలిపించారు ప్రజలు అందరూ సహకరించాలని, అలాగే మీ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వాడి వదిలిన టైర్ లు కొబ్బరి బొండాలలో దోమలు ఉత్పత్తి అవుతాయని అటువంటి వస్తువులు లేకుండా చుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ సి హేచ్ గోవిందరావు, సూపర్ వైజర్లు, మలేరియా సిబ్బంది పారిశుద్ధ్యం సిబ్బంది సానిటరీ ఇన్ స్పెక్టర్ రవి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం పదిలం

- అమూల్యం మిల్లెట్ కిచెన్ ను ప్రారంభించిన జేపి
- తక్కువ ధరలకే శ్రేష్టమైన ఆహార పదార్థాలు



డాబాగార్డెన్స్: ప్రస్తుతం నగర జీవి ఎన్నో రకరకాల ఆహార పదార్థాలతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని, చిరుధాన్యాల ఆహారాన్ని ప్రతి ఒక్కరు స్వీకరిస్తే తప్పనిసరిగా చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చు అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయన్ అన్నారు. శనివారం సంపత్ వినాయక టెంపుల్ రోడ్డు లోని అమూల్యం మిల్లెట్ కిచెన్ ను జయప్రకాశ్ నారాయణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. స్వచ్ఛమైన ఆహార పదార్థాలను అందరూ వినియోగించుకోవాలని అన్నారు. నేటి యువతరం ప్రభుత్వ ఉద్యోగాలు పైన కాకుండా సొంతంగా సమాజానికి ఉపయోగపడే, ప్రజలకు అవసరమైన పరిశ్రమలను నెలకొల్పి ఇతరులకు ఉద్యోగ కల్పనను అందించాలన్నారు. షాపు యజమాని సురేష్ మాట్లాడుతూ తమ అమూల్య మిల్లెట్ కిచెన్‌లో తక్కువ ధరకే నాణ్యమైన, రుచికరమైన, శ్రేష్టమైన, ఆహారపదార్థాలను అందిస్తున్నామన్నారు. ప్రజలందరి ఆరోగ్యమే పరమావధిగా తమ రెస్టారెంట్ లో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని చక్కటి ఆరోగ్యాన్ని పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, విశ్వనాథ్, రెస్టారెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోదీ మాటలమనిషి

దిల్లీ: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ విఫలమయ్యారని దిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, తెదేపా సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు విమర్శించారు. మోదీని మాటల మనిషిగా ఆయన అభివర్ణించారు. శనివారం ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 2014లో ప్రజలు ఎన్నో ఆశలతో మోదీకి ఓట్లు వేసిగెలిపించారని గుర్తుచేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఈ ఐదేళ్లలో కనీసం 10 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆక్షేపించారు. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రధాని విద్వేషాలు రెచ్చగొట్టారన్నారు. ఆయన హయాంలో ఆర్థిక నేరగాళ్లు బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పారిపోయారని ధ్వజమెత్తారు. మోదీ పాలనలో రైతు సమస్యలు ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. ఏపీ విభజన హామీలన్నీ పెండింగ్‌లోనే ఉంచారని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగాయని, ఆయనను మరోసారి భరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



విశాఖపట్నం : జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ సూపర్ వైజర్ ప్రభావతి, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు బెహరా వెంకటరత్నం, ప్రత్యేక అధికారి వెంకట నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దోమల పై దండయాత్ర లో భాగంగా శనివారం దక్షిణ నియోజకవర్గం 24వ వార్డు, బుక్కావీధి, కంచరవీధి తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రజా చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతీ ఇంటికి వెళ్లి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటిలోని నీళ్ల కుండీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టేందుకు అనుకూలంగా ఉంటుందని వారికి వివరించారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలతాయని హెచ్చ రించారు. ఇప్పుడు మార్చుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పాడైన టైర్లను, వాడేసిన కొబ్బరి బోండాలను, చెత్తను ఉంచుకోరాదని, ఇవి చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. వీటిని కాల్వల్లో, గెడ్డలో పారేయకుండా ఎప్పటికప్పుడు జివిఎంసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఇంట్లో ఎవరైనా జ్వరాల బారిన పడితే వెంటనే ప్రభుత్వ ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకువెళ్లి వైద్య చికిత్స అందజేయాలన్నారు. ప్రజా చైతన్యంతోనే దోమలకు అడ్డుకట్ట వేయవచ్చని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెహరా శ్రావణిదేవి, కొల్లి లక్ష్మి, ఏ.దేవి, బాబి, నవీణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగాధర్ రెడ్డి వర్ధంతి

భీమునిపట్నం తగరపువలస చిట్టివలస జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్. గంగాధర్ రెడ్డి వర్ధంతి సభ శనివారం ఘణంగా నిర్వహించారు. చిట్టివలసః జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగాధర్ రెడ్డి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అప్పలరెడ్డి మాట్లాడుతూ గంగాధర్ రెడ్డి కార్మికులు కు ఎనలేని సేవ చేసారని అన్నారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా సరే వారి తరపున మేనేజ్ మెంట్ తో పోరాటం చేసి వారికి ఇంక్రిమెంట్లు ఇప్పించారని, అంతే కాకుండా నెల్లిమర్ల జ్యూట్ మిల్ ఈ రోజు పనిచేస్తుందంటే ఆయన చలవేననీ తెలిపారు. ఉత్తరాంధ్ర లో ఆయనను జ్యూట్ టైగర్ అనీ పిలిచే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎం.ఆదినారాయణ రెడ్డి, ఐ.ఎన్.టి.యు.సి నాయుకులు జీరు వెంకటరెడ్డి, ఎ.ఐ.టి.యు.సి నాయుకులు అల్లు బాబూరావు, సి.ఐ.టి.యు నాయుకులు రవ్వ నర్సింగరావు, కాంగ్రెస్ కార్మిక సంఘం నాయుకులు సరగడ ఈశ్వరావు,ఎం.అప్పారావు, కార్మిక సోదరులు, వివిధ సంఘాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య స్వరార్చన

**- ఉడా చిల్డ్రన్ ఎరీనా లో 2 రోజుల పాటు 611 వ జయంతి ఉత్సవాలు**




విశాఖపట్నం : పద కవితా పితామహుడు, తొలి వాగ్గేయ కారుడు అన్నమయ్య 611వ జయంతి ఉత్సవాలు సిరిపురం ఉడా చిల్డ్రన్ ఎరీనా లో ఢిల్లీ తెలుగు అకాడమీ, చైతన్య అన్నమయ్య సంగీత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభము అయ్యాయి . ఢిల్లీ తెలుగు అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎన్ వి ఎల్ నాగరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రారంభించారు. రెండు రోజులపాటు అన్నమయ్య గీతాలతో స్వరార్చన కార్యక్రమం సంధ్యారాగపు సరిగమలుగా నిర్వహిస్తున్నారు. ముద్దుగారే యశోద, పిడికిట తలంబ్రాలు, నారాయణతే, అదివో అల్లదివో శ్రీ హరి వాసము ... అంటూ అనేక గీతాలు ఆద్యంతం ఓలలాడించాయి.

సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎస్ జెడ్ కమిషనర్ ఏ ఆర్ ఎం రెడ్డి, పూర్వపు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విశాఖకు చెందిన శ్రీ చైతన్య అన్నమయ్య మ్యూజిక్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 200 మంది శిష్య బృందం గానం తో తొలి రోజు కార్యక్రమం ప్రారంభమై హరిత సిస్టర్స్ (శ్రీ హరిత సర్వేపల్లి, సారిక మామిడన్న)ల గళంలో అన్నమయ్య విన్నపాలు, అనంతరం అన్నమాచార్య పద సౌరభం , అంబికేశ్వర కూచిపూడి డాన్స్, మ్యూజిక్ అకాడెమి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన , సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఏ యూ వి సి ప్రొఫెసర్ జి నాగేశ్వర రావు, సెంచూరియన్ వి సి జి ఎస్ ఎన్ రాజు, ప్రొఫెసర్ డి ఎన్ రావు, జస్టిస్ సోమయాజులు, ద్రోణంరాజు శ్రీనివాస్, అవంతి శ్రీనివాస్, గీతం అధినేత శ్రీభరత్, వెలగపూడి రామకృష్ణ బాబు, తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సి ఎం ఆర్ అధినేత మావూరి వెంకట రమణ, కోరోమండల్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ సి హెచ్ వి ఎస్ కృష్ణ కిశోరె, డివిజినల్ అక్కౌంట్స్ ఆఫీసర్ నాగరాజు నౌడు, పారిశ్రామిక వేత్త వెంకట సత్య దివాకర్ పక్కి, స్వాతి ప్రమోటర్స్ డైరెక్టర్ మేడపాటి రమేష్ రెడ్డి లకు డి టి ఏ పురస్కారాలు ప్రదానం చేసారు.

# మిస్టర్ రిక్రూటర్స్ -హెచ్ఆర్ సొల్యూషన్స్ ప్రారంభం

**- యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం - సినీ నటుల చేతుల మీదుగా పోస్టర్, వెబ్‌సైట్ ఆవిష్కరణ**




విశాఖపట్నం : మిస్టర్ రిక్రూటర్స్-హెచ్ఆర్ సొల్యూషన్స్ సంస్థ శనివారం నగరంలో ప్రారంభమైంది. సిరిపురం కూడలిలోని మంత్రీస& హెూటల్‌లో మిస్టర్ రిక్రూటర్స్ సంస్థ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సంస్థ ఎండి, సిఈఓ బి.వంశీక్రిష్ణ తెలియజేశారు. ముందుగా సంస్థ పోస్టర్, వెబ్‌సైట్‌లను సినీ నటులు చిట్టిబాబు, గీతా సింగ్, జయలలిత, శ్రీలక్ష్మి, రాగిణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండి వంశీక్రిష్ణ మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపార సంస్థల విస్తరణ నేపథ్యంలో ఉపాధి అవకాశాలు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని నిపుణత, అర్హత కలిగిన యువతకు అవసరమైన పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలకు కల్పించే విధంగా ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. సంస్థలకు, నిరుద్యోగ యువతకు మధ్య వారధిగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు పూర్తిస్థాయిలో ఉచితంగా ఉపాధిని కల్పించే దిశగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. సంస్థ ప్రారంభ సందర్భంగా ఆరునెలల కాలం ఉచితంగా నిరుద్యోగ యువతకు పూర్తిస్థాయిలో సేవలు అందించడం జరుగుతోందన్నారు. సినీ హాస్య నటుడు చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతీ నిరుద్యోగికి తగిన ఉపాధిని కల్పించే విధంగా సంస్థ పనిచేయాలన్నారు. ఇటువంటి సమాజహిత కార్యక్రమాలలో భాగం కావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. యువతలోని సామర్థ్యాలను గుర్తించి తదనుగుణంగా ఉపాధిని కల్పించాలని సూచించారు. సంస్థ చైర్మన్ బి.వెంకట రమణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ వాణిజ్య సంస్థలలో ఎప్పటికప్పుడు ఖాళీలకు గుర్తించి, వారి అవసరకాలకు అనుగుణంగా యువతకు ఎంపిక చేసి ఉపాధిని కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయిలో సంస్థ తమ సేవలు అందించే ప్రక్రియ ప్రారంభమయ్యిందన్నారు. నిత్యం అనేక సంస్థల్లో నిపుణులైన సిబ్బంది కొరత దర్శనమిస్తోందన్నారు. వీటిని నివారించే దిశగా ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. నిరుద్యోగ యువత తమ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సినీనటులు శ్రీలక్ష్మి, గీతాసింగ్‌లు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించే దిశగా మిస్టర్ రిక్రూటర్స్ పనిచేయాలన్నారు. ప్రతీ ఒక్కరికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశం ఎంతో మంచిదన్నారు. ఇటువంటి అవకాశాలకు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ షేక్ నవాజ్, మేనేజర్ సల్మా తదితరులు పాల్గొన్నారు.



# విజయభాను సంపాదకీయం

## ఆవరించిన యుద్ధోన్మాదం

ఇరాక్, లిబియా, సిరియా తదితర దేశాలపై దాడులు సాగించి విధ్వంసం సృష్టించిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌పై దృష్టిపెట్టింది. అమెరికా భీకర యుద్ధనౌకా పటాలమైన క్యారియర్ స్ట్రయిక్ గ్రూప్ ఇరాన్ వైపుగా ప్రయాణిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ యుద్ధనౌకా శ్రేణి ఇప్పటికే ఈజిప్టు సూయెజ్ కాలువను దాటి ఎర్ర సముద్రంలో చేరిందని తెలుస్తున్నది. అమెరికా విమాన వాహక నౌక అబ్రహం లింకన్ నాయకత్వంలోని నౌకా దళంతోపాటు అణ్వాయుధాలతో కూడిన విమాన వాహక నౌకను కూడా అమెరికా పర్షియన్ జలసంధి వైపు తరలిస్తున్నది. అవి ఇరాన్‌కు సమీపంగా ఉన్న ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరానికి ఇప్పటికే చేరుకున్నట్టు తెలుస్తున్నది. క్యారియర్ స్ట్రయి క్ గ్రూప్‌లోని భారీ విమాన వాహక నౌక మీదనే దాదాపు డెబ్బయి యుద్ధ విమానాలుంటాయి. ఈ ప్రధాన నౌకకు తోడు క్రూజర్ అనే భారీ యుద్ధ నౌక ఉంటుంది. మరికొన్ని యుద్ధ నౌకలు కూడా ఈ బృందంలో ఉంటాయి. జలాంతర్గాములు కూడా వీటి వెన్నంటి ఉండవచ్చు. ఇప్పటికే పలు దేశాల్లోని ప్రభుత్వాలను కూలదోసి అక్కడి సమాజాలను ఛిన్నాభిన్నం చేసిన చరిత్ర అమెరికాది. దేశాధ్యక్షుడైన ట్రంప్ మరింత యుద్ధపిపాసిగా కనిపిస్తున్నారు. ఆయన బృందంలోని సభ్యు లలో కూడా యుద్ధోన్మాదం ఆవరించుకొని ఉన్నది. ఇరాన్ తమ వాణిజ్య కేంద్రాలపై జరుపబోతున్నదనే గూఢచార నివేదికలు తమకు అందాయని అందువల్ల ముందు జాగ్రత్తగా ఈ యుద్ధబలగాలను పర్షియన్ జలసంధికి తరలిస్తున్నామని అమెరికా అంటున్నది. ఇరాక్‌పై దాడి చేయడానికి ముందు కూడా అమెరికా ఇటువంటి సాకులే చెప్పిందని ఇరాన్ ప్రత్యారోపణలు చేస్తున్నది. అమెరికా తమవైపు ఏదో ఒక తప్పు చూపి దాడి చేయాలనుకుంటున్నదనీ, తాము ఏ తప్పు చేయకపోయినా, ఏదో ఒకటి తమకు ఆపాదించి దాడి చేయవచ్చునని ఇరాన్ ఆరోపించింది. అమెరికా ఇరాన్‌ను దెబ్బతీయడానికి మొదటి ఆర్థిక ఆంక్షలు విధించి ఆ తర్వాత యుద్ధానికి కాలుదువ్వుతున్నది. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థి క వ్యవస్థను సంక్షోభంలో పడేయాలని ప్రయత్నిస్తున్నది. కానీ ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షలు పెట్టడం వల్ల భారత్, చైనా, యూరప్ దేశాలకు ఇబ్బంది కలుగుతున్నది. తాజాగా ఇరా న్ నుంచి ఖనిజాల ఎగుమతులపై కూడా ఆంక్ష లు విధించింది. ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత ఇరాన్‌ను లొంగదీసుకొని అక్కడి వ్యవస్థలను కుప్పకూల్చాలని ప్రయత్నిస్తున్నారు. ముందుగా అణు ఒప్పందం నుంచి వైదొలిగారు. తాము శాంతియుత ప్రయోజనాల కోసమే అణు కార్యక్రమాన్ని సాగిస్తున్నామని ఇరాన్ మొదటినుంచి అంటున్నది. ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇరాన్‌ను అణు ఒప్పందానికి కట్టుబడి ఉండేలా చేశారు. ఇందులో యూరప్ దేశాలను కూడా భాగస్వాములుగా చేశారు. శాంతియుత ప్రయోజనాల కోసం ఎంత మేర ఎంత తక్కువ నాణ్యమైన యురేనియం శుద్ధి అవసరమో అంతే ఉత్పత్తి చేసేవిధంగా కట్టడి చేశారు. ఇందుకు ఇరాన్ కూడా కట్టుబడి ఉన్నది. ఇరాన్‌ను ఇదేవిధంగా కట్టడి చేస్తే సరిపోయేది. కానీ ట్రంప్ అధ్యక్షుడు కావడంతో అమెరికా యుద్ధ మార్గాన్ని ఎంచుకున్నది. ఇరాన్‌తో అణుఒప్పందంలో అమెరికాతో పాటు భాగస్వాములైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు నిస్సహాయంగా ప్రేక్షక పాత్ర పోషించడం ఆశ్చర్యం కలుగుతున్నది. అమెరికా ఆంక్షలను ఆమోదించబోమని చైనా అంటున్నది.కానీ ఇప్పటివరకు చైనా నుంచి కూడా భరోసా అందలేదు. ఇక భారత్ ముందే అమెరికా ఆదేశాలకు తలొగ్గింది. అమెరికా ప్రదర్శిస్తున్న ఆధిపత్య ధోరణి తక్షణం ఇరాన్‌కు ముప్పుగా మారింది. కానీ ఈ అమెరికా పెత్తందారీతనం ప్రపంచానికే ప్రమాదకరం. ఇట్లా ఒక బలమైన దేశం తమకు నచ్చని దేశాలపైపడి అక్కడి ప్రభుత్వాలను కూల్చుతూ పోవడం 21వ శతాబ్దంలో కూడా సాగడం ఆశ్చర్యకరం. ఒక దేశ సార్వభౌమత్వాన్ని మరోదేశం గౌరవించాలని, ఒకరి అంతరంగిక వ్యవహారాల్లో మరొకరు జోక్యం కలిగించుకోకూడదనే అంతర్జాతీయ సూత్రాలకు విలువలేకుండా పోతున్నది. అమెరికా ఆధిపత్యం ఇట్లానే కొనసాగడం అన్నిదేశాల ప్రయోజనాలకూ ముప్పే. అమెరికా కొన్ని దేశాలపై దాడులు చేస్తూ మిగతా దేశాలను సులభంగా బెదిరించగలదు. ఉదాహరణకు భారత్‌పై వాణిజ్య ఆంక్షలను విధించింది. అమెరికా షరతులు భారత్‌కు అంగీకారయోగ్యంగా లేవు. దీనిపై చర్చలు సాగుతున్నాయి. కానీ ఇట్లా ఇటువంటి భయానక పరిస్థితుల్లో సాగే చర్చలు న్యాయబద్ధమైన పరిష్కారాన్ని ఇవ్వవు. బలమైన దేశాన్ని బలహీనమైన దేశాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పించగలుగుతుంది. బడుగు దేశాలు తాము నష్టపోతామని తెలిసి కూడా అమెరికా వాణిజ్య ప్రయోజనాలు నెరవేర్చవలసి రావచ్చు. ప్రపంచ వ్యాప్తంగా వలస వాదం మరో రూపంలో ఏర్పడుతున్నది.

## కాపు తుంగ్లాంలో చలివేంద్రం ప్రారంభం



గాజువాక: జీవీయంసీ 59వ వార్డు కాపు తుంగ్లాంలో రైల్వే గేటు వద్ద ప్రజలు, పాదచారుల సౌకర్యార్థం యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. శనివారం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎండలు మండుతున్నాయని, జనం బయటకు రావడానికి బయపడుతున్నారని అన్నారు. అయితే కొన్ని ముఖ్యపనులకోసం తప్పనిసరిగా రావసిన అవసరం ఉండడంతో ఇటుగా రాకపోకలు చేసేవారికి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసామని తెలిపారు. మజ్జిక, చల్లని నీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు విరోతిరాజు, జర్నలిస్టు శ్రీనివాసరావు, కె.తిరుపతిరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో మెట్లు..?....... వ్యర్ధాలు తొలగించేదెట్లు..?



సింధియా: జీవీయంసీ 49వ వార్డు మార్కెట్ వీధిలో నూతనంగా నిర్మాణం చేపట్టిన సామాజిక భవనంకోసం అవసరమగు మెట్లను మురుగుపోయే కాలువను మట్టితో కప్పి నిర్మాణం చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురుగు పాయే కాలువను కప్పడంవలన మురుగు ఎలా పోతుందని ప్రశ్నించారు. జీవీయంసీ నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం ప్రణాళిక బద్ధంగా నిర్మించడంలేదని, స్థానికులకు ఇబ్బంది కల్గించేవిధంగా ఉందని నిత్యం మురుగుపోయే కాలువను కప్పి మెట్లు నిర్మాణం చేపట్టడం దారుణమని, దీనిపై సంబంధిత అధికారులను అడిగితే కనీసం స్పందన లేదని స్థానికులు వాపోయారు. అధికారులు ఇప్పటికైన స్పందించాలని, సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

## న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్సైగా సన్యాసిరావు బాధ్యతల స్వీకరణ



పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సన్యాసిరావు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛానిచ్చి స్వాగతం పలికారు. ఇప్పటివరకు ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహించిన ఎ.ఆర్.కొండబాబు నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రై, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్, పై దృష్టిపెడతామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన జరిమానాలు, శిక్షలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు, స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఓటింగ్ సరళిపై సమీక్ష



గాజువాక: గతనెల 11వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో గాజువాక అసెంబ్లీ అభ్యర్థిగా వైకాపా తరుపున పోటీచేసిన తిప్పలనాగిరెడ్డికి ఎంతమేరకు వార్డుల వారిగి ఓటింగ్ జరిగిందనే అంశంపై సమీక్షను నిర్వహించారు. పోలింగ్‌బూత్‌లువారిగా పోలైన ఓటింగ్ సరళిపై సమీక్ష జరిగింది. వైకాపా కార్యాలయంలో 61వ వార్డు, టియన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో 63వ వార్డుకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ తన గెలుపును ఆకాంక్షిస్తూ కష్టబడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు, అభినంద నలను, కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు రాజాన వెంకటరావు, జి.రామనాయుడు, మద్దిశంకరెడ్డి, రెడ్డిజగన్నాధం, మధీనబాషా, పిట్టరెడ్డి, ఉరుకూటిఅప్పారావు, భూపతి రాజుసుజాతా, కటికలన కల్పన, పరదేశి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### జూదం

జీవితమే - ఓ జూదం  
గెల్పు - ఓటమిల ఆట  
బ్రతుకు బాట ప్రయణంలో  
ఎన్నుకొన్న వృత్తి - ప్రవృత్తులలో  
ప్రయోజకత్వమో! - అప్రయోజకత్వమో!  
వృద్ధియో - వృధాయో!  
స్థాపితమో! - సమఃస్థాపితమో! ...॥జీ॥

వృత్తి నిన్ను తిండి పెట్టకపోతేను  
ప్రవృత్తికి వెల్తేను.  
పాముకాటు వేసేనో!  
పగడయైకా, పాడెనో! ...॥జీ॥

ఈ అర్థాంగి అదృష్టమో!  
నీ పిల్లల దురదృష్టమో!  
నీలలాట తిలకమని  
సరిపెట్టుకోవడమో! ...॥జీ॥

ఎదుగుదల ఉంటేను  
ఎన్నుపోటుదారులు నిఘా లేసి ఉంటారు  
తప్పద్రోవ చూపించి  
నీ త్రోవను దోచుకొనేరు  
ఆ, పరమార్థం తెల్సుకోలేకుంటే;  
ఎదుటవాటి గెల్పుకు నాందివేసే వాడి  
వైయ్యేవు  
నీ బ్రతుకుబాట-ముళ్లు పోదాయెను ...॥జీ॥

... కవితా రచన  
యల్.సిద్ధు

## పంచాంగం

మాసం : వైశాఖ తిథి : అష్టమి సా.4.45; ఆశ్లేష ఉ.11.23; రా.వ.10.33ల 12.02.

ఆదివారం 12-05-2019

**మేషం** : సతీసమేతంగా ఒక పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు. స్త్రీలకు అకాల భోజనం వల్ల ఆరోగ్యంలో ఇబ్బందులు తప్పవు. ఎదుటివారితో మితంగా సంభాషించడం మంచిది. **వృషభం** : పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. కిరణా, ఫ్యాన్సీ, వ్యాపారులకు కలిసివచ్చేకాలం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ ఏకాగ్రత అవసరం. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. ప్రైవేటు సంస్థలలో పొదుపు చేయటం మంచిదికాదని గమనించండి. **మిథునం** : దీర్ఘకాలిక రుణాలు తీర్చి ఊపిరి పీల్చుకుంటారు. స్త్రీలకు షాపింగ్ విషయాలలో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. ఒక స్థిరాస్తి అమర్చుకోవాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ప్రయాణాలు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. నిరుద్యోగులు ఉహాగానాలతో కాలం వ్యర్థం చేయకండి. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తినిస్తాయి. **కర్కాటకం** :మత్స్య కోళ్ళ వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. కుటుంబీకులతో కలిసి విందు వినోదాలలో పాల్గొంటారు. విదేశాలకు వెళ్లడానికి చేయుయత్నాలు ఫలిస్తాయి. సోదరీ, సోదరుల మధ్య సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. స్త్రీలకు ఆడంబరాలకు పోయి సమస్యలు తెచ్చుకోకండి. **సింహం** : ఆర్థికంగా బాగుగా స్థిరపడతారు. రాజకీయ నాయకులు, తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. దైవ దర్శనాలలో చురుకుగా పాల్గొంటారు. ఖర్చులు అధికం. వైవాహిక జీవితంలో అనుకోని చికాకులు తలెత్తుటకు ఆస్కారం ఉంది. కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. **కన్య** : హోటల్ తినుబండ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. స్త్రీలకు పనివారితో సమస్యలు తలెత్తుతాయి. కాని వేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పొదుపు చేయడం మంచిది కాదని గమనించండి. ప్రముఖులను కలుసుకుంటారు. అతిథి మర్యాదలు బాగుగా నిర్వహిస్తారు. **తుల** :స్త్రీలకు ఇరుగు పొరుగు వారి నుంచి సమస్యలు తలెత్తుతాయి. మీ సంతానం మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. రవాణా రంగాల వారికి ప్రయాణీకులతో ఇబ్బందులు తప్పవు. కొబ్బరి, పండ్లు, పూలు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలలో జయం చేకూరుతుంది. విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. **వృశ్చికం** : మీ రాక బంధువులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి అధికమవుతుంది. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. దూర ప్రయాణాలలో వస్తువుల పట్ల మెళకువ అవసరం. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ ఉన్నతిని చాటుకోవడం కోసం ధనం బాగా ఖర్చు చేస్తారు. **ధనుస్సు** :బంధువుల రాకపోకలు అధికమవుతాయి. హోటల్ వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. స్త్రీలకు షాపింగ్ వ్యవహారాల్లో మెళకువ అవసరం. ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం అధిక సమయం వేచి ఉండాల్సి వస్తుంది. సతీసమేతంగా ఒక పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు. విదేశాల నుంచి ఆప్తుల రాక సంతోషాన్ని కలిగిస్తుంది. **మకరం** : నిరుద్యోగులకు ఇంటర్వ్యూ సమాచారం అందుతుంది. మిత్రుల కలయికతో మనశ్శాంతి చేకూరుతుంది. మీ అవసరాలకు ధనం సర్దుబాటు కాగలదు. వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటారు. సంఘంలో మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగ అవ కాశాలు లభిస్తాయి.ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. **కుంభం** : ధనమూలక సమస్యలు ఒక కొలికివస్తాయి. వాయిదా పడిన పనులు ఎట్టకేలకు పూర్తి చేస్తారు. విద్యార్థులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. పదవులు సభ్యత్వాలు, బాద్యతలు స్వీకరిస్తారు. ఖర్చులు అంచనాలను మించుతాయి. విలాసాలకు బాగా వ్యయం చేస్తారు. **మీనం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కని పెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. వాతావరణంలో మార్పు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. ఆలయాలను సందర్శిస్తారు. రాజకీయ నాయకులకు ఎదుటివారిని గమనించి ఎత్తుకు పై ఎత్తు వేసి ముందుకు సాగండి. ఇతరుల తప్పిదాలకు సైతం మీరే బాధ్యత వహించాల్సి వస్తుంది.. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగలకు ఇంటర్వ్యూలలో మెళుకవ అవసరం. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోన వుతారు.ఖర్చులు అధికమవుతాయి.

## సంకీర్తన

### గోమాతకు వందనం



ఆవు పాలలోని వివిధ గుణాల కారణంగా ఆవు పాలను అమృతం అని చెప్పబడింది. ఆవుపాలు ఔషదాలలో ఘటకాంశంగా నిలచింది. ప్రతిరోజు మన ఆహారంలో పాల ఉత్పత్తులైన పెరుగు, వెన్న, నెయ్యి మొదలగునవి వాడబడతాయి. ఇతర ప్రాణుల మలాన్ని అశుద్ధంగా చెప్పబడినా, ఆవు పేడ మాత్రం ఎంతో శుభకరమైనదిగా చెప్పబడింది. సైన్స్ ఈ విషయాన్ని అంగీకరిస్తూ ఆవు పేడ చెడువాసన లేనిదేకాక అనుకూల శక్తిని వెల్ల డిస్తుందని అని చెప్పడం జరిగింది. మొక్కలకు మరియు చెట్లకు ఆవుపేడ మంచి ఎరువుగా ఉపయోగ పడుతుంది. ఔషధాలలో ఆవు మూత్రం ఎంతో వైభ వాన్ని కలిగివుంది. పూజల్లో సైతం ఆవు మూత్రాన్ని ఉప యోగిం చడం జరుగు తుంది. గొప్ప ఔషధ గుణాలు కలిగిన గోరో జనము ఆవు నుదుటి భాగంలో ఓ సంచి లాంటి దానిలో ఉంటుంది. గోరో జనము ఆయుర్వేదం సూచించే ఓ గొప్పదైన ఔషదం. ఇన్నీ ప్రయోజనాలతో కూడిన, ఎంతో ఉపయోగాత్మకమైన ఆవుకు గోమాత అనే పేరు సార్థకమైనదే.

**పవిత్రతకు చిహ్నం:**

భారతీయులు ఆవును గోమాత అని పిలుస్తారు. గోవు పవిత్రతకు మరియు శుభానికి చిహ్నం. గోవు యొక్క పాలు, మూత్రము మరియు పేడ ఎంతో పవిత్రమైనది. ఆవును దర్శించి రోజులోని పనులు ప్రారంభించదం ఎంతో శుభశకునంగా భావించ బడింది. శ్రీ కృష్ణ పరమాత్మ గోపాలకుడిగా వ్యవహరించాడని పురాణాలు చెబు తున్నాయి. ఇన్నీ ప్రయోజనాలతో కూడిన, ఎంతో ఉపయోగాత్మకమైన ఆవుకు గోమాత అనే పేరు సార్థకమైనదే.

**అందరికీ ఆప్తమిత్రుడు:**

మానవ జాతికి ఆప్తమిత్రుడు ఆవు. హజరత్ మహ్మద్ ఆవు పాలలో రసాయనం, ఆవు నెయ్యిలో అమృతముందని, దాని మాంసం తింటే రోగిస్టులవుతారని హెచ్చరించాడు. ఏసుక్రీస్తు ఒక ఎద్దును వధిస్తే ఒక మనిషిని చంపినట్లుగా భావించాలన్నాడు. గాంధీజీ గోరక్షణ స్వరాజ్య ప్రాప్తి కంటే ప్రముఖమైనదిగా పేర్కొన్నారు. గోసంతతిని కాపాడితే ఈశ్వరుడు సృష్టించిన ప్రాణకోటిని రక్షించినట్టే.. స్వామి దయానంద సరస్వతి గోకరుణా నిధిలో ఒక ఆవు తన జీవన కాలంలో లక్షల మందికి పైగా ఒక పూట భోజనాన్ని సమకూర్చ గలదు అని వాఖ్యానించారు. రుగ్వేదం ఆవును అఘన్యా అని.. గోవు ఎవరికీ సాటి లేనిదని యజుర్వేదం.. ఆవు సంపదలకు పుట్టినిల్లని అధర్వణ వేదం వర్ణించాయి. అమృతం సేవిస్తున్నప్పుడు బ్రహ్మ నోటి నుంచి కారుతున్న నురుగ ద్వారా ఆవులు జన్మించాయని, ఆవుల పాలతో సముద్రం ఉద్భవించింది. సముద్ర మధనం జరిగినప్పుడు కామధేనువు అవత రించింది.బ్రహ్మపురాణంలో వ్యాస భగవానుడు సమస్త గోవులు విష్ణు స్వరూపం, అన్ని అవ యాలలో భగవానుడైన కేశవుడు విరాజమానుడై ఉన్నాడు. ఆవు ముఖంలో నాలుగు వేదాలు నిక్షిప్తమై ఉన్నాయని పద్మ పురాణం చెప్పింది. సమస్త వేదాలు ఆనందంతో గోవులను స్తుతిస్తాయి.

ఆవు పాలను తాగిన శ్రీకృష్ణుడు జ్ఞానాన్ని పెంచుకుని లోకాలను ఉద్ధరించడానికి గీతా జ్ఞానాన్ని ప్రబోధించాడు.

శ్రీకృష్ణుడు ప్రత్యక్షం కావాలంటే ఆయనకు ఇష్టమైన గోవులను పూజిస్తే చాలు. కృష్ణ భగవానునికి మరోపేరు గోపాలుడు అంటారు.గోప బాలురతో కూడిన గోవర్ధన పర్వతాన్ని ఎత్తి ఇంద్రుని ప్రకోపం నుంచి గోవులను, సమాజాన్ని రక్షించాడు.

బోళా శంకరుని వాహనం నంది. రుషభ దేవుని చిహ్నం ఎద్దు. శివ మందిరాలలో నంది ప్రతిష్ఠితమై ఉంటుంది. గోస్వామి తులసీదాసు ధర్మార్థ కామ మోక్షాల ఫలాలు ఆవుయొక్క నాలుగు పాదుగు స్థానాలలో నిక్షిప్తమై ఉన్నాయని అభివర్ణించారు. సంత్‌నామ దేవుడు ఢిల్లీ పాదుషా కోరిక మేరకు మృతిచెందిన గోవును బతికించి అందరిని అబ్బురపరిచారు. సిక్కుల పదవ గురువు గోవిందసింహుడు చండీదివార్‌లో గోరక్షణ కోసం దుర్గాభవాని నుంచి దీవెనలు పొందారు. హిందువులు గోపూజ జరిపితే పారశీకులు ఆంబోతును ఆరాధిస్తారు.

అక్కడి ప్రాచీన నాణేలపై, పిరమిడ్లపై ఎద్దుల చిత్రాలను చిత్రించేవారు. జైనుల ఆగమాలలో గోవు స్వర్గంలో ఉండదగినదని, దానిని సంహరించతగదని జైనులు పేర్కొన్నారు. భగవాన్ మహావీరుడు గోవులను కాపాడకుండా మానవులను రక్షించడంలో అర్థం లేదన్నారు.

ఆవు వెన్నెముకలో సూర్యకేతు నాడి ఉం టుంది. ఈ నాడి సూర్యుని ప్రకాశంతో మరింత ఇనుమడిస్తుంది. ఈ నాడి చేతన పొందిన క్షణంలో పచ్చని ద్రవాన్ని వదిలిస్తుంది.

అందుకే ఆవు పాలు పచ్చగా ఉంటాయి. విషాన్ని హరించే శక్తి ఆ పాలకు ఉంటుంది. ఆవు నెయ్యి, బియ్యం రెండు కలిపి వేడి చేస్తే శక్తివంతమైన గ్యాస్‌లు, ఇథలిన్ ఆక్సైడ్, ప్రోపలీన్ ఆక్సైడ్ ఉత్పన్న మవుతాయి. ఈ ఆక్సైడ్‌లు జీవన రక్షణగా ఉపయోగపడతాయి.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# చురుగ్గా రామాలయ పున:నిర్మాణ పనులు



ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో రామాలయ పున:నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఇక్కడున్న ఆలయం శిధిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి సారించి రూ.40లక్షలు మంజూరు చేయించారు. దీనికి మరికొంత గ్రామస్థులు విరాళాల రూపేణా పోగు చేసుకొని నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వచ్చే నెలాఖరులోగా ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

# దిబ్బలపాలెం పాఠశాలను తెరిపించాలని వినతి

రావికమతం : మండలంలో పి.పొన్నవోలు శివారు దిబ్బలపాలెం ప్రాధమిక పాఠశాలను పున:ప్రారంభించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో కొన్నేళ్లుగా ఉన్న ప్రాధమిక పాఠశాలను ఇటీవల ఆర్.కొత్తూరు పాఠశాలలో విలీనం చేశారన్నారు. దీంతో రెండు కిలో మీటర్ల దూరం ఉన్న ఆర్.కొత్తూరు పాఠశాలకు పిల్లలు నడిచి వెళ్లలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని చెప్పారు. దీనిపై సిఆర్‌పి వినతిపత్రం అందజేశారు. దీంతో సీఆర్పీ మాట్లాడుతూ విషయాన్ని ఎంఇఒ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## బీఎస్ఎన్ఎల్‌కు 4జీ స్పెక్ట్రమ్ అవసరం : జీఎం జి.ఆదాం



అరసవల్లి : జిల్లాలో బీఎస్ఎన్ఎల్‌కు 4జీ స్పెక్ట్రమ్ తక్షణమే అవసరమని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి.ఆదాం పేర్కొన్నారు. ఎన్ఎఫ్‌టీఈ 7వ జిల్లా మహాసభలను శ్రీకాకుళం నగరంలోని ఓ హొటల్‌లో జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న జీఎం ఆదాం మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఆదాయం తగ్గడం వాస్తవమని, ప్రస్తుతం సంస్థ నష్టాల్లో ఉందని చెప్పారు. సంస్థ ఆర్థికాభివృద్ధికి ఉద్యోగుల వీఆర్ఎస్‌తో ఎటువంటి ఉపయోగం ఉండక పోవచ్చున్నారు. వీఆర్ఎస్ ఇచ్చిన సంస్థలు, తదుపరి లాభాలు చూసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్‌కు విలువైన ఆస్తులున్నాయని, వాటిని వాణిజ్యపరంగా వినియోగిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. 4జీ స్పెక్ట్రమ్ వినియోగంలోకి వస్తే ప్రైవేటు సంస్థలతో పోటీ పడే అవకాశం వస్తుందని వివరించారు. బీఎస్ఎన్ఎల్ ఎన్ఎఫ్‌టీఈ సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖరరావు మాట్లాడుతూ సంస్థ నష్టాలకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. 4జీ స్పెక్ట్రమ్ కోసం సంఘాలు ఎప్పటి నుంచో పోరాటాలు చేస్తున్నారన్నారు. అనంతరం ఎన్ఎఫ్‌టీఈ జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా డి.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడిగా హెచ్.అప్పన్న, జిల్లా కోశాధికారిగా హెచ్.చిన్నవాడు, సహాయ కార్యదర్శిగా కె.సింహాచలం తదితరులు ఎన్నికయ్యారు.

# ఉపాధి చట్టం అమల్లో నిర్లక్ష్యం

రోలుగుంట : ఉపాధి హామీ పథకం చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీల నీడ కోసం టెంట్లు, తాగునీరు, ప్రధమ చికిత్స పెట్టెలు తదితర సౌకర్యాలేవీ లేదని చెప్పారు. నిబంధనల ప్రకారం కూలీలకు అన్ని వసతులు కల్పించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

# ఆడాకులలో తాగునీటి ఎద్దడి

కొయ్యూరు : ఆడాకులలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నీరు లేకపోవడంతో తాండవ కాలువ నుంచి తెచ్చుకుంటున్నారు. మూడు నెలల కిందట ఆడాకులలో సిసి రోడ్లు వేశారు. ఆ సమయంలో మంచినీటి ట్యాంకునకు వెళ్లే పైపు దెబ్బతింది. నాటి నుంచి గ్రామంలో కొన్ని ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదు. మిగిలిన ప్రాంతాలకు కూడా నామమాత్రంగానే సరఫరా అవుతోంది. అధికారులు తక్షణమే చర్యలు పైపులైన్‌కు మరమ్మత్తులు చేపట్టి పూర్తి స్థాయిలో తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మరోసారి తమ ఉదారతను చాటిన 97 బ్యాచ్ 10వ తరగతి పూర్వవిద్యార్థులు



పరవాడ: పరవాడ జడ్పీ పాఠశాలో 1996-97 తమతో చదువుకొన్న తమ సహవిద్యార్థినియైన ఉమ గొర్లివానిపాలెం గ్రామంలో నివాసం ఉంటుంది. ఆమె భర్త అనారోగ్యంతో మరణం పొందారు. ఉమకు సంతోష్, ధనుష్ ఇద్దరు కుమారులు ఉన్నారు. తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావటం వలన మేమున్నామంటూ తనతో విద్యనభ్యసించిన తోటి విద్యార్థులు ఆర్థిక సహాయం అందించడానికి సిద్ధమయ్యారు. గతంలో కూడా తమ తోటి విద్యార్థిని పైల కుమారి చనిపోతే ఆ కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం చేశారు. మా శక్తిమేరకు సహాయం చేయటం మా కనీస ధర్మమని తోటి విద్యార్థులు పేర్కొన్నారు. సేకరించిన రూ 66,000 వేల మొత్తాన్ని ఉమ కు అందజేసామని ఈ సంథర్భంగాపైల అప్పారావు చెప్పారు. మిగిలిన మిత్రులు కూడా ఉదారంగా ముందుకు వచ్చి సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పూర్వవిద్యార్థులు పైల అప్పారావ్, హేమలత, గిరిప్రసాద్,సూర్య,దేవి భవాని,కనక మహలక్ష్మి,బొద్దపు అయ్యబాబ్, మదీన్, పి అయ్యబాబు. బి.రాము,గోవ్, తదితరులు పాల్గొన్నారు.

# విరోతి రమేష్ అకస్మిక మరణం



పరవాడ : యాభైఅరోవవార్డులంకెలపాలెం మరిడిమాంబ పాసింజర్ అటో యూనియన్ సభ్యులు విరోతిరమేష్ ఆకస్మికంగా మరణించారు. రమేష్ అత్మకిశాంతిచేకురాలనీ పదినిమషాలు మోనం పాటించారు. రమేష్ కుటుంబసభ్యులు 60000 రూపాయలును అటోస్టాండ్ సభ్యులు చేతులుమీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశము పార్టీ నాయకులు రౌతు శ్రీనువాసురావు, వైసిపి నాయకులు సుందరపు అప్పారావు, వై.వి.నరిశింహము, అధ్యక్షులు రమణ, ఉపాధ్యక్షులు నాగసూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనా గానం



విశాఖపట్నం : అన్నమయ్య పద కోకిల పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ స్థాపించిన అన్నమాచార్య భావనా వాహిని విశాఖ నగర శాఖ ఆధ్వర్యంలో రామ్ నగర్ మెయిన్‌రోడ్డు దరి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనా గానం అందరినీ ఆకట్టుకుంది. నగరానికి చెందిన సత్యరాజ్ సంగీ తాలయ వ్యవస్థాపకులు వై.బాలగణేష్ సంగీత సారథ్యంలో వారి శిష్యబృందం అన్నమాచార్య సంకీర్తనలు మధురంగా ఆలపించి భక్తజనుల మన్ననలను పొందారు. అన్నమాచార్య సంకీర్తనలకు వ్యాఖ్యాతగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వ్యవ హరించారు. దీనికి ముందు ఎ.అన్నపూర్ణ నేతృత్వంలో సామూ హికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించడమైనది. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణము మరియు అన్నమాచార్య సంకీర్తనలో పాల్గొన్నారు. విచ్చేసినవారందరికీ తీర్థ ప్రసాదములు అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ ఎ.పి.ఎస్.మూర్తి, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఎ.అన్నపూర్ణ, జె.సోమయాజులు, శ్రీ రాఘవేంద్రస్వామి మఠం మేనేజరు పవన్ కుమార్ ఆచార్య, మఠం అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా కెజిహెచ్‌లో ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదిన వేడుకలు



విశాఖపట్నం : మే 12వ తేదీ ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం కింగ్ జార్జ్ హాస్పిటల్ నర్సింగ్ విభాగం వారు నైటింగేల్ జన్మదినాన్ని ఘనంగా కాగితాల పద్మావతి, నర్సింగ్ అసో సియేషన్ జిల్లా కార్యదర్శి ఆధ్వ ర్యంలో నిర్వహించడం జరిగింది. నర్సింగ్ వృత్తి ఒక గౌరవప్రధమైన వృత్తి అని లోకానికి చాటిచెప్పిన వనిత నైటింగేల్. యుద్ధంలో గాయపడిన వారికి ఆవిడ నిరంతరం సేవలు చేస్తూ నడిచే దీపంగా కొనియాడబడే నైటింగేల్ జన్మదినాన్ని మేము కె.జి.హెచ్‌లో నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కింగ్‌జార్జ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా॥ జి.అర్జున్, గౌరవ అతిధులుగా డా॥ శాస్త్రి, ఆర్.ఎమ్.ఓ, మరియు దొర, ఆర్.ఎమ్.ఓ పాల్గొని నైటింగేల్ చేసిన సేవలను కొనియాడారు. డా॥ జి.అర్జున్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మీరు రోగులకు మెరుగైన సేవలను అందిస్తున్నం దువలనే ఈరోజు మన కె.జి.హెచ్ ఇంత పురోభివృద్ధి చెంది వేలాదిమందికి సేవలు అందిస్తోందని నర్సింగ్ సిబ్బందినుద్దేశించి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్, యూనిట్ ప్రెసిడెంట్ కోనేరు వరలక్ష్మి, నిర్మలకుమారి, రాష్ట్ర అధ్యక్షులు, నర్సింగ్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్, భవాని, కోశాధికారి, యూనిట్ సభ్యులు దుర్గాంభ, పద్మజ, జ్ఞానాంబ మరియు ఉపాధ్యక్షులు గౌరి, వరలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక మరియు తదితర ఆటల పోటీలు నిర్వహించి ముఖ్య అతిధి చేతులమీదుగా బహుమతులు అందచేయడం జరిగింది. కింగ్ జార్జ్ ఆసుపత్రి నర్సింగ్ విభాగంలో విలువైన సేవలు అందించినందుకు గాను నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని భాగ్యలక్ష్మి, రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మి కుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్, కొద్ది రోజులలో నర్సింగ్ సూపరింటెండెంట్ బాధ్యతలు స్వీకరించే శ్యామలకి, హెడ్ నర్స్ లీలను ఘనంగా సత్కరించుకోవడం జరిగింది.

# తైక్వాండో శిక్షణకు బాలికల ఆసక్తి

## వేసవి శిబిరాలకు అధిక సంఖ్యలో హాజరు



యలమంచిలి : ఆత్మరక్షణలో పాటు శారీరక మానసిక ఆరోగ్యాన్ని కలిగించే క్రీడా అయిన తైక్వాండో (కొరియా కరాటే) నేర్చుకునేందుకు అధిక సంఖ్యలో పట్టణంలోని యువకులు బాల బాలికలు ఉత్సాహం చూపిస్తున్నారు. అసలు యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌కు ఆదరణ లభిస్తోంది. జిల్లా స్పోర్ట్స్ అధారిటీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. తైక్వాండో సీనియర్ మాస్టర్, నేషనల్ రెఫరీ సత్యనారాయణ, సీనియర్ మహిళా తైక్వాండో కోచ్ గేదెల జ్యోతి ఇక్కడ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరం కోసమే కాకుండా అనంతరం కూడా ఇక్కడా తరచూ తైక్వాండో శిక్షణ నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న విద్యార్థులంతా తైక్వాండో నేర్చుకోవచ్చుని ఈ సందర్భంగా కోచ్ నాగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. సమ్మర్ కోచింగ్ అనంతరం జూన్ మాసంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఈ పోటీలలో పాటు తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



విశాఖపట్నం : విశాఖ అర్బన్-2 ప్రాజెక్టు మద్దిల పాలెం సెక్టారులో గల కెఆర్ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భిణీ అని తెలియగానే అంగన్‌వాడీలో రిజిస్ట్రేషన్ చేసుకుని పౌష్టికాహారం అందుకుని, తగిన సలహా సంప్రదింపులు తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకి జన్మనిచ్చి తల్లిబిడ్డలు సురక్షితంగా ఉంటారని అంగన్‌వాడీ టీచరు ఆర్.సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సంజీవని, ఆశా, చిన్నతల్లి, గర్భిణీ, బాలింతలు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# గిరిజనేతరుల భూ దందాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



అనంతగిరి : మండలంలోని ఎంఆర్.పురం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో గిరిజనేతరుల భూ దందాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్ సీ, ఎస్ టి, కమీషన్ సభ్యులు అబ్రహం డిమాండ్, చేశారు. శనివారం అనంతగిరి పి ఏ సిఎస్ డైరెక్టర్ రాజ్ కుమార్, బొర్రా పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు జన్ని అప్పారావుతో కలిసి బాధిత గ్రామాలను సందర్శించారు. ఎన్ ఆర్ పురం, గ్రామంలో స్థానిక ప్రజలతో కలసి విషయాలను తెలుసుకుని గ్రామాలలో నెలకొన్న పరిస్థితులపై గిరిజన ప్రజలు ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు అబ్రహం గారికి తెలిపారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ గిరిజనుల భూములు గిరిజనులను మోసం చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న హైదరాబాదుకు చెందిన సాగర్ రెడ్డి త్రిలోక రెడ్డి తదితర వ్యక్తులు ప్రజలకు ఎలాగా మోసం చేసింది.

స్థానిక ప్రజలు అభ్రహంనకు వివరించారు దీనిపై అబ్రహం మాట్లాడుతూ ప్రభుత్వ దృష్టికి గిరిజనులు మోసగించబడిన విషయం తీసుకువెళ్లి న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు.

CHANGE OF NAME
I, RICHIE AKA D RICHIE ROBINSON Resident of D.No.21-69/21/1, G.F.1, Shri Ram Nagar, Janachaitanya Housing, Pendurthi, Visakhapatnam-531 173, do hereby declared that changed my old name RICHIE AKA D RICHIE ROBINSON to new name RICHIE ROBINSON I request all to consider my name RICHIE ROBINSON

# ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

మందస : యువతి, యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మందసలో సంచలనం రేపింది. ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారమే ఈ పరిస్థితికి దారి తీసి నట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. పురుగుల మందు తాగి ఓ ప్రదేశంలో పడి ఉన్న వీరిద్దరిని కుటుంబసభ్యులు గమనించి 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. కాపువీధికి చెందిన ఓ యువతి(20) పొందర వీధికి చెందిన వెంకటేశ్(21) స్నేహితులు. వీరి మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారింది. యువతికి రెండేళ్ల క్రితం ఇదే మండలానికి చెందిన వ్యక్తితో వివా హం అయ్యింది. ఆ తర్వాత కూడా వీరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతూనే ఉంది. ఇటీ వల యువతి అత్తవారింటి నుంచి పుట్టింటికి వెళ్లింది. మందస సమీపంలోని ఓ ప్రదేశంలో యువతి, యువకుడు కలుసుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ పురుగుల మందు తాగి, ఆత్మ హత్య చేసుకోవాలని ప్రయత్నించారు. ఇద్దరు పడి ఉండడాన్ని గమనించిన రెండు కుటు ంబాల సభ్యులు హుటాహుటిన వారిని ఆసు పత్రికి తరలించారు.

## 15న రెవెన్యూ ఉద్యోగులతో మెగా రక్తదాన శిబిరం : జేసీ-2 రజనీకాంతరావు

శ్రీకాకుళం : జిల్లాలో లక్ష యూనిట్ల రక్తం సేకరించాలనేది కలెక్టర్ ఆశయమని.. దీని సాధనకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని సంయుక్త కలెక్టర్-2 పి.రజనీకాంతరావు కోరారు. శ్రీకాకుళం నగరంలోని శాంతా అనురాగ నిలయంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశంపై ఈ నెల 15న 150 మంది శ్రీకాకుళం డివిజన్ రెవెన్యూ ఉద్యోగులతో నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. ఆ తరువాత టెక్కలి, పాలకొండ డివిజన్ల పరిధిలో ఉద్యోగులతో రక్తదానం చేయించడానికి నిర్ణయించామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను భాగస్వామ్యం చేస్తామన్నారు. వంశధార ప్రాజెక్టు ఎస్ఈ సురేంద్రరెడ్డి తమ ప్రాజెక్టు పరిధిలోని ఇంజినీర్లు వివిధ విభాగాల ఉద్యోగులు 300 మందితో దశలవారీగా రక్తదానం చేయించడానికి ముందుకు రావడమే కాకుండా.. మొదటి విడతగా 71 మందితో కూడిన జాబితా అందజేశారన్నారు.

జిల్లా జనాభాలో ఒక్క శాతం ముందుకు వస్తే లక్ష యూనిట్లు సాధించడం పెద్ద కష్టం కాదన్నారు. లక్ష మంది ప్రాణాలు కాపాడేందుకు ఉద్దేశించిన బృహత్తర కార్యక్రమం విజయవంతానికి యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అదించాలని జేసీ-2 కోరారు.

## సత్యదేవుని కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు బహూకరణ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దివ్య కళ్యాణం ఈ నెల 15 వ తేదీన అంగరంగ వైభవంగా జరుగుతున్న సందర్భంగా శ్రీ స్వామివారి కళ్యాణానికి 5 కేజీలు ముత్యాల తలంబ్రాలును విశాఖ పట్నం కు చెందిన శ్రీవల్లి షిప్పింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ అధినేత పి.బాబూరావు శనివారం దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి ఎం.వి.సురేష్ బాబు కు అందజేసి ఈ తలంబ్రా లును స్వామివారి దివ్యకళ్యాణంలో ఉపయోగించవలసినదిగా కోరారు.

ఈ సందర్భంగా దాతలను ఈవో సురేష్ బాబు అభినందించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దామెర. కృష్ణారావు,టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని కళ్యాణానికి కోటి తలంబ్రాలు బహూకరణ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దివ్య కళ్యాణం ఈ నెల 15 వ తేదీన అంగరంగ వైభవంగా జరుగుతున్న సందర్భంగా శ్రీ స్వామివారి కళ్యాణానికి 5 కేజీలు గోటితో వలచిన కోటి తలంబ్రాలును కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన మారిశెట్టి.శ్రీధర బ్రహ్మజీరావు మరియు వారి మిత్ర బృందం శనివారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వి.సురేష్ బాబు కు అందజేసి ఈ తలంబ్రాలును స్వామివారి దివ్యకళ్యాణంలో ఉపయోగించవలసినదిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఈవో సురేష్ బాబు అభినందించారు.

## సెంట్రల్‌లో ఫ్రీ షాపింగ్ సంబరాలు

***శుక్రవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు..***

విశాఖపట్నం : ప్రముఖ ఫ్యాషన్ డిపార్ట్‌మెంటల్ స్టోర్ అయిన సెంట్రల్ 15వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉచిత షాపింగ్ అవకాశాన్ని వినియోగదారులకు కల్పిస్తున్నట్లు సెంట్రల్ సీఈవో విష్ణుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ మూడు రోజులు విశాఖతో పాటు రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఉన్న తమ స్టోర్స్‌లో రూ.3999 విలువల గల షాపింగ్ చేస్తే.. ఆ మొత్తాన్ని ఫ్యూచర్ పే లో ఉన్న సెంట్రల్ వాలెట్‌లో క్యాష్‌బ్యాక్ చేయనున్నట్లు పేర్కొన్నారు. యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డు ఉపయోగించి రూ.ఐదు వేలు షాపింగ్ చేస్తే పది శాతం క్యాష్‌బ్యాక్ పొందవచ్చన్నారు. పేటీఎం వినియోగదారులు రూ.మూడు వేలు కొనుగోలుపై 30 శాతం క్యాష్‌బ్యాక్ పొందవచ్చని తెలిపారు.

దీంతో పాటు రూ.పది వేలు, రూ.ఇరవై వేల షాపింగ్‌పై రూ.2500, రూ.5000 విలువలగల బహుమతులు పొందవచ్చన్నారు. రూ.లక్ష కొనుగోలుపై ఎల్‌ఈడీ టీవీని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఆఫర్లు ఈనెల 12వ తేదీ వరకూ ఉంటాయని తెలిపారు.

## సంహితాలో మినీ జాబ్ మేళా

రావులపాలెం : నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధికి అవకాశం కల్పిస్తున్నట్లు సంహిత డిగ్రి కళాశాల చైర్మన్ దినేష్ బాబు తెలిపారు. కౌశల్ గోదావరి, వికాస ఆధ్వర్యంలో శ్రీ సంహిత డిగ్రీ కళాశాల, రావులపాలెం నందు సోమవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఈ జాబ్ మేళాలో ఆర్.ఎస్.ఎమ్.ఐ.పి.ఎల్. సంస్థలో మొబైల్ టెక్నిషియన్, బిగ్ బాస్కెట్ సంస్థలో కస్టమర్ రిప్రజెంటేటివ్, ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ సంస్థలో లోడర్స్, డ్రైవర్స్, ఎలైట్ కంపెనీస్ (కియా మోటార్స్) లో టెక్నిషియన్, టి.సి.ఎస్ సంస్థలో బిజినెస్ ప్రొసెస్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఎస్.ఎస్.సి., ఇంటర్, డిప్లమో (మెకానిక్) డిగ్రీ, బి.టెక్ (మెకానిక్) ఉత్తీర్ణులైన 18 నుండి 30 సం॥ల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ నెల 13 సోమవారం రావులపాలెం సంహిత డిగ్రీ కళాశాల వద్ద ఉదయం 9 గంటలకు తమ బయోడేటా, సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలతో హాజరు కావలెనని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉఉఉ.జఉఉఘుంయశీఎం.ఉశీఎ చూడవలెనని, సెల్ 97031 38819 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

## ఎన్నికల కమిషన్ కేంద్రానికి కీలుబొమ్మగా వ్యవహరిస్తోంది

### తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి.రామ్



భీమునిపట్నం : తగరపువలస సాయిరాం పార్లర్ లో తెలుగుశక్తి అధ్యక్షులు బి.వి.రామ్ విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ - ఈస్ట్ ఇండియా కంపెనీయా అర్థం కావడం లేదని భారత ఎన్నికల కమిషన్ పై ధ్వజమెత్తారు. ఈనెల 19న అన్ని ప్రధాన పార్టీల నాయకులతో చిట్టివలస జ్యూట్ మిల్ ఆవరణలో సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విశాఖ ఎం.పి దగ్గుబాటి పురంధేశ్వరి, భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు లు ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కారణంగా వీరిని అనర్హులుగా గుర్తించి ఆ నియోజకవర్గాలలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసారు. విశాఖ బిజెపి అభ్యర్థి పురందేశ్వరి ఎయిర్ ఇండియా లోబోర్డు డైరెక్టర్ పదవినిర్వహిస్తూ ఎన్నికల నిబంధన ప్రకారం ఆపదవికి రాజీనామా చేయకుండానే నామినేషన్ దాఖలు చేసారని తెలిపారు. భీమిలి వైకాపా అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు 2014 అఫిడివిట్ లో తాను ఏమీ చదవలేదని పేర్కొన్నారని చెప్పారు. మరి 2019 అఫిడవిట్ లో డిగ్రీ చదివి నట్లు ఎందుకు పేర్కొన్నారో వివరణ ఇవ్వాలని కోరారు. అయితే ఈ రెండు అంశాలపై రిటర్నింగ్ అధికారికి,రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు మార్చి 26న ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. అయితే ఈ ఫిర్యాద్ పై స్పందించిన ఆయన తనను న్యాయపరంగా చూసుకోవాలని సూచించడం జరిగిందని చెప్పారు.ఎన్నికల కమిషన్ కేంద్రానికి కీలుబొమ్మగా వ్యవహరించడం దుర్మార్గమని తెలిపారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు ను ఆశ్రయించనున్నట్లు అన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల కమిషన్ కేంద్రానికి తొత్తుగా వ్యవహరించి అపహాస్యం చేస్తుందని చెప్పారు.1951 ఎన్నికల చట్టం ప్రకారం తప్పుడు సమాచారం అందజేసిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించి ఆ నియోజకవర్గంలో రీపోలింగ్ జరగడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు శక్తి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ మ్యూజియంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

### సందర్శకులతో కిటకిటలాడిన మ్యూజియం

**- ఆ రోజులే వేరు - చిన్ననాటి ఆటపాటలు ఎన్నటికీ పదిలం**



విశాఖపట్నం : చిన్ననాటి ఆటపాటలు జీవితాంతం మధుర జ్ఞాపకాలేనని, వాటిని ఎన్నటికి ఎవరూ మరువలేరని విజయనిర్మాణ సంస్థ అధినేత సూరపునేని విజయకుమార్ అన్నారు. ప్రముఖ చిత్రకారుడు, రంగస్థల, బుల్లితెర, వెండితెర నటుడు రాజా రాంబాబు ఆధ్వర్యంలో విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ను శనివారం సాయంత్రం విజయకుమార్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ఆటపాటలు నేటి తరానికి వచ్చే సరికి కొంత తగ్గుముఖం పట్టిన ఇప్పటికి అవి పదిలంగానే ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆటపాటలకు నేటికి కొదవ లేదన్నారు. గౌరవ అతిధిలుగా హాజరైన ప్రేమ ఆసుపత్రి అధినేత ఎస్.వి.ఆది నారాయణరావు, ప్రముఖ సినీ దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు ఈ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నో పెయింటింగ్లు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. కర్రా బిల్లా, కోతి కొమ్మచ్చి, తాటికమ్మల గరగాట, చేపల వేట, బస్సు, రైలు ఆట, విద్యార్థులకు సంబంధించిన ఎన్నో ఆటలను తన ఆర్టు ద్వారా కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్ ను తిలకించినట్లు అయితే చాలా మందికి బాల్యం చిరకాలం జ్ఞప్తికి ఉండిపోతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ను తిలకించినట్లు అయితే తమ బాల్యం గుర్తుకు రావడం ఖాయమన్నారు. అవకాశం ఉన్న ప్రతీ ఒక్కరూ తమ పిల్లలకు ఈ ఎగ్జిబిషన్‌ను చూపించే ప్రయత్నం చేయాలని వీరు పిలుపునిచ్చారు. ఆనాటి జ్ఞాపకాలను ఎస్.వి.ఆదినారాయణరావు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాటి ఆటల వల్లే తనకు అప్పట్లో పలు అవకాశాలు కూడా కలిగాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజియం ఇన్ ఛార్జ్ పాత్రుడు, నటుడు ఎఫ్ఎం బాబాయ్, మణిశర్మ తదితరులంతా పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ ను తిలకించడానికి వచ్చే వారితో మ్యూజియం సందడిగా మారింది.

## రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో సత్తా సాటాలి



విజయనగరం : విశాఖపట్నంలో ఈ నెల 26,27 తేదీలలో జరగనున్నరాష్ట్రస్థాయి ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని సత్తా చాటాలని ఒలింపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్. వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలను శనివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. జిల్లా జట్టుకు సుమారు 20మంది ఎంపికయ్యారని శిక్షకులు పి.అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



ములగాడ : విద్యార్థులకు వేసవి సెలవుల సందర్భంగా మల్కాపురం ప్రకాష్ నగర్ గ్రంథాలయంలో ఏప్రిల్ 24 నుండి ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి ఇందులో భాగంగా శనివారం గ్రంథాలయంలో చిన్నారులకు ఆటల పోటీలు వివిధ సంస్కృతి కార్యక్రమాల్లో ప్రముఖులు జాతీయ సేవా పథకం వాలంటీర్లు అధ్యాపకులు వీరికి స్వచ్ఛంగా శిక్షణ ఇస్తున్నారు ఈసమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ పి ఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం వాలంటీర్లు ఇదే తరహాలో అన్ని శిక్షణ శిబిరాలలో చిన్నారులకు మంచి విషయాలను నేర్పించాలని ఈనాటి బాలలే రేపటి పౌరులు బాలలే మన దేశానికి వారే సంపద సక్రమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు ఈ శిక్షణ శిబిరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కె సాయి ప్రత్యూష గుప్తా అజ్మీని ఘనంగా సత్కరించారు అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆటలతో పాటలతో చక్కగా ప్రదర్శించారురు.

ఈ కార్యక్రమంలో కే సత్తి రాజులు బి సత్యానందం గ్రంథాలయ అధికారి వి అజయ్ కుమార్ మోహన్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గణితం పై ఉన్న భయాన్ని తొలగించుకోవాలి



అచ్యుతాపురం : గణితం పై ఉన్న భయాన్ని తొలగించుకోవాలని రవీంద్ర స్కూలు గణిత ఉపాధ్యాయుడు కె ఎన్ వి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. స్థానిక గ్రంధాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం ఆయన విద్యార్థులకు సులభంగా గణితం నేర్చుకోవడంలో మెళుకువలు నేర్పించారు .అనంతరం గ్రంధాలయాధికారి డి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంధాలయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

విజయనగరం : గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సిబ్బందికి సంయుక్త కలెక్టర్-2 జె.సీతారామారావు సూచించారు. స్థానిక వీటీ అగ్రహారంలోని మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ఆయన నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల బరువు పెరుగుదల, రక్తహీనత వంటి అంశాలతో పాటు.. గర్భిణుల ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. లబ్ధిదారులకు అందించే గుడ్ల సరఫరాలో బార్‌కోడ్ విధానం అమలు చేస్తున్నామని, దీని వల్ల అక్రమాలు అరికట్టవచ్చని చెప్పారు. రాష్ట్రంలోనే ఐసీడీఎస్ సేవల్లో జిల్లాను మెరుగైన స్థానానికి తీసుకురావాలని సూచించారు. గత నెల నిర్దేశించిన లక్ష్యాలు, రాబోయే నెల చేపట్టబోయే కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో బి.పద్మావతి, ఏపీడీ శాంతకుమారి పాల్గొన్నారు.

# స్వచ్ఛంగా తీర్చి దిద్దిన పాడేరు పట్టణం

పాడేరు : అధికార యంత్రాంగం పాడేరు పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చి దిద్దారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి డి. కె. బాలాజీ, సబ్ కలెక్టర్ డా. వేంకటేశ్వర్ సలిజామల చీపురుపట్టి పట్టణ వీధులను ఊడ్చేచారు. చెత్తను ఏరి పారేశారు.మోద కొండమ్మ అమ్మవారి జాతర నేపధ్యంలో శనివారం ఏజెన్సీ అధికార యంత్రాంగం పాడేరు పట్టణ వీధుల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టి పట్టణంలోని వీధులను పరిశుభ్రం చేసారు. ఈ సందర్భంగా ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి , డి. కె. బాలాజీ మాట్లాడుతూ పట్టణ ప్రజలు పరిసరాలను పరిశ్రుభ్రంగా ఉంచాలని కోరారు. ముఖ్యంగా వ్యాపారస్తులు వ్యర్థాలను రహదారుల్లో వేయకుండా షాపుల ముందు చెత్త బుట్టలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. 14 స్వచ్ఛ బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఉదయం 6 గంటలకు చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమములో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉత్సాహకంగా పాల్గొని పారిశుధ్యపు పనులు చేపట్టారు. చిట్టినాయుడు పెట్రోల్ బంకు నుండి సుంద్రుపుట్టు సాయి బాబా గుడి వరకుకు ఐసిడి ఎస్ అధికారులు, ఎంపీడి ఓ కార్యాలయం నుండి గ్యాస్ గోడౌన్ మీదగా కొత్త ఆసుపత్రి వరకు ఎం. పి .డి. ఓ సిబ్బంది, సాయిబాబా గుడి నుండి శతకంపట్టు వరకు జిసిసి, అటవీ శాఖ సిబ్బంది పరిశుభ్రం చేసారు. శతకం పట్టు నుండి బంగారం షాపుల మీదగా జూనియర్ కళాశాల గేటు వరకు వెలుగు సిబ్బంది, శతకం పట్టు నుండి అంబేద్కర్ కూడలి వరకు డివిజనల్ పంచాయతీ అధికారి ,సిబ్బంది, సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి జూనియర్ కళాశాల గేటు వరకు సబ్ కలెక్టర్ కార్యాలయపు సిబ్బంది, జూనియర్ కళాశాల గేటు నుండి ఐటిడి ఏ కార్యాలయం వరకు ఐటిడి ఏ సిబ్బంది, సెరీకల్చర్ కార్యాలయం నుండి రేకుల కాలనీ మీదగా పి ఎం. ఆర్ సి వరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది .. స్వచ్ఛ భారత్ నిర్వహించారు.

పి. ఎం. ఆర్ సి గడ్డి కాలనీ నుండి బక్కలపనుకు వరకు ఉపాధిహామీ సిబ్బంది, సినిమా హాలు సెంటర్ నుండి లోచలిపుట్టు మీదగా డిగ్రీ కళాశాల వరకు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గేటు నుండి సుంద్రుపుట్టు ఆంజనేయ స్వామి గుడి వరకు ఎం. ఇ. ఓ సిబ్బంది, సెయింటాన్స్ పాఠశాల కింద రోడ్డు నుండి కొత్తపాడేరు వరకు విద్యుత్తు శాఖ, సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి పాత పాడేరు వరకులు పోలీసులు, గుడివాడ చిట్టి నాయుడు వీధి నుండి గుడివాడ గ్రామం వరకు వర్తక సంఘం, ఆర్ టి సి డిపో మరియు బస్ కాంప్లెక్స్లో ఆర్ టి సి సిబ్బంది పరిశుభ్రం చేసారు. అధికార యంత్రాంగానికి అభినందనలు రాలని సబ్ కలెక్టర్ డా. వేంకటేశ్వర్ సలిజామల మాట్లాడుతూ స్వచ్ఛపాడేరు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను, సిబ్బందికి అభినందనలు తెలియ జేసారు. స్థానిక వర్తకలు, జాతరలో వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు పారిశుధ్యాన్ని పాటించాలని కోరారు.పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

పారిశుధ్య సిబ్బంది సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగించకూడదన్నారు. హోటళ్లు , మద్య దుకాణాపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమములో ఐటిడి ఏ పరిపాలనాధికారి కె. నాగేశ్వరరావు, ప్రాజెక్టు ఉద్యానవన అధికారి జి.ప్రభాకరరావు, వెలుగు ఎపిడి నాగేశ్వరరావు, అదనపు జిల్లా వైద్యాధికారి డా. లీలా ప్రసాద్, ఐటిడి ఏ మేనేజర్ సునీల్ , డివిజనల్ పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఐటీడీ ఏ, ఐసిడి ఎస్, వెలుగు, ఉపాధిహామీ , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 12 ఉగ్రసంస్థలపై పాక్ నిషేధం

ఇస్లామాబాద్ : పలు ఉగ్రవాద సంస్థలపై పాకిస్థాన్ ప్రభుత్వం నిషేధం విధించింది. హఫీజ్ సయీద్, మసూద్ అజార్‌తో సంబంధాలున్న 12 సంస్థలపై పాక్ సర్కార్ వేటు వేసింది. నిషేధిత సంస్థల జాబితాలో జైషే మహమ్మద్, లాహోర్‌కు చెందిన అల్ అన్ఫల్ ట్రస్ట్, ఇదరే ఖద్మత్ ఖలాక్, అల్ దావత్ ఉల్ ఇర్షాద్, అల్ హమద్ ట్రస్ట్, మాస్క్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్, అల్‌మదీనా ఫౌండేషన్, ముయాజ్ బిన్ జబాల్ ట్రస్ట్, అల్ ఈసర్ ఫౌండషన్ తదితర 12 సంస్థలు ఉన్నట్లు పాక్ వెల్లడించింది.

## ఏపీకి పిడుగుల హెచ్చరిక



అమరావతి: రాష్ట్రంలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. విశాఖ్ జిల్లా పెద్బయ్య, జి. మాడుగుల్, పాడేరులో పిడుగుపడే అవకాశం ఉందన్నారు. ఇక గుంటూరు జిల్లాలో బెల్లంకొండ్, దాచేప్లి, మాచ్రవ్రం, కారంపూడి, గుర్జాల్, రెంట్చింత్ల్, మాచ్ర్ల, దుర్గి, ఈపూరు, నకరికల్లులో పిడుగులు పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి, ముండ్లమూరు, ఎర్రగొండపాలెం, నాగులుప్పలపాడు, క్నిగిరి, టంగుటూరు, మార్కాపురం, పొదిలి ప్రాంతాల్లో పిడుగుపడే అవకాశం ఉందని సూచించారు.

## ఏపీలో ఫ్యాన్ గాలి వీస్తోంది : లక్ష్మీపార్వతి



గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫ్యాను గాలి బాగా వీస్తోందని, 120 నుంచి 130 సీట్లు గెలుచుకుని వైఎస్సార్‌సీపీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు లక్ష్మీపార్వతి ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులో లక్ష్మీపార్వతి విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో పెట్టిన రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీలను పూర్తి చేయలేదని చెప్పారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు.

స్పెషల్ విమానాలను వాడి ప్రజల ధనాన్ని వృధా చేశారని మండిపడ్డారు. నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు నుంచి నేడు ప్రజలకు వెన్నుపోటువరకు చంద్రబాబుకు ప్రజాతీర్పులో శిక్ష తప్పదని శపించారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి 40 సీట్లకు మించిరావని జోస్యం చెప్పారు.

## కుంబ్లే జట్టులో నో కోహ్లీ.. నో రోహిత్



దిల్లీ : ఐపీఎల్ ఫైనల్ పోరుకు ముందు భారత మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన 2019 ఉత్తమ ఐపీఎల్ జట్టును ప్రకటించాడు. ధోనీని కెప్టెన్‌గా ప్రకటించిన ఆ జట్టులో రాయల్ ఛాలెంజర్స్ కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు ముంబయి ఇండియన్స్ కెప్టెన్ రోహిత్‌శర్మకు చోటు కల్పించలేదు. బెంగళూరు బౌలర్ చాహల్‌కు అవకాశం ఇవ్వని కుంబ్లే.. ఆశ్చర్యకరంగా రాజస్థాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ శ్రేయస్ గోపాల్‌కు చోటు కల్పించాడు. దిల్లీ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా ఈ జట్టులో చోటు లభించింది. ధోనీ, రాహుల్, పాండ్య, బుమ్రా మినహా భారత జట్టు ఆటగాళ్లలో మరెవరికీ అవకాశం ఇవ్వలేదు. తన జట్టులో ఆటగాళ్ల ఎంపికపై కుంబ్లే వివరణ ఇచ్చాడు.

శ్రేయస్ అయ్యర్‌ను ఎందుకు తీసుకున్నానంటే.. అతను సత్తా ఉన్న ఆటగాడు. ఇప్పటికే ఐపీఎల్‌లో రాణించాడు. క్లిష్ట పరిస్థితుల్లోనూ బాధ్యత తీసుకొని బ్యాటింగ్ చేస్తాడు. దిల్లీ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించదు. అయినా, శ్రేయస్ బ్యాటింగ్ చేసి చూపించాడు. 16 మ్యాచుల్లో 463 పరుగులు చేశాడు అని కుంబ్లే తెలిపాడు. సన్‌రైజర్స్ బ్యాట్స్‌మన్ డేవిడ్ వార్నర్‌ను తీసుకున్నప్పటికీ మరో ఓపెనర్ బెయిర్‌స్టోకు అవకాశం ఇవ్వలేదు. అతని స్థానంలో కేఎల్ రాహుల్‌కు అవకాశం ఇచ్చాడు. వార్నర్, బెయిర్ స్టో ఇద్దరూ ప్రమాదకరమైన బ్యాట్స్‌మెన్. నేను కూడా బెయిర్‌స్టోను తీసుకోవాలని అనుకున్నా. కానీ, జట్టు సమతూకం కోసం రాహుల్‌ను ఎంచుకున్నాను అని తెలిపాడు. మిడిల్ ఆర్డర్‌లో హార్దిక్ పాండ్య, రసెల్‌కు కచ్చితంగా చోటు కల్పించాల్సిందే. ఎందుకంటే.. ఈ సీజన్‌లో టీ20 క్రికెట్‌కు అర్థం చెప్పింది వాళ్లిద్దరే అన్నాడు. అయితే, శ్రేయస్ గోపాల్ ఎంపిక గురించి మాత్రం వివరణ ఇవ్వలేదు.

కుంబ్లే ప్రకటించిన 2019 ఐపీఎల్ జట్టు..

ధోనీ(కెప్టెన్, వికెట్ కీపర్), డేవిడ్ వార్నర్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్‌పంత్, హార్దిక్ పాండ్య, అంధ్రూ రసెల్, శ్రేయస్ గోపాల్, ఇమ్రాన్ తాహీర్, కగిసో రబాడా, జస్ప్రీత్ బుమ్రా.

## బీజేపీలో చేరిన సినీ, టీవీ నటుడు




న్యూఢిల్లీ: సీనియర్ సినీ, టీవీ నటుడు అరుణ్ బక్షి శనివారంనాడు భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీ సీనియర్ నేత, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ పట్ల తాను విశేషంగా ఆకర్షితుడనయ్యానని, ఆయన స్థాయి నేత మరొకరు లేరని అన్నారు. అందుకే తాను బీజేపీలో చేరినట్టు చెప్పారు. పంజాబ్‌లోని లూథియానాలో పుట్టి, పెరిగిన అరుణ్ బక్షి 100కు పైగా హిందీ చిత్రాల్లో నటించారు.

298 పాటలు కూడా పాడారు. భోజ్‌పురి, పంజాబీ సినిమాల్లోనూ ఆయన నటించారు. బీఆర్ చోప్రా మహాభారతంలో దృష్టద్యుమ్నుడి పాత్ర ఆయనకు మంచిపేరు తెచ్చింది.

## ధవళేశ్వరంలో యువజంట ఆత్మహత్య!

### కుటుంబ కలహాలే కారణమని అనుమానం



రాజమహేంద్రవరం నగరం: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణ మండలం ధవళేశ్వరంలో దారుణం చోటుచేసుకుంది. ధవళేశ్వరంలోని కొత్తపేటలో యువ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే, వీరి ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులు ధవళేశ్వరానికి చెందిన తూరంగి జగదీశ్, రాజమహేంద్రవరం సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన తోట దీప్తిగా గుర్తించారు.

ప్రేమ వివాహం చేసుకున్న వీరిద్దరూ కొత్తపేటలో గత ఎనిమిది నెలలుగా అద్దెకు ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం మేడపైకి వెళ్లిన ఇంటి యజమాని వీరి గది తలుపు మూసి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని గది తలుపులు తెరిచేసరికి ఇద్దరూ విగతజీవులై కనిపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలశౌరి తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# చిత్రభాను

## నాగశౌర్య సరసన మెహరీన్ క్లాప్ కొట్టిన దర్శకేంద్రుడు




యువ కథానాయకుడు నాగశౌర్య కొత్త సినిమా ఆరంభమైంది. ఇందులో ఆయన సరసన మెహరీన్ నటించనున్నారు. ఐరా క్రియేషన్స్ పతాకంపై నాగశౌర్య తల్లి ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు రమణ తేజ సినిమాను తెరకెక్కిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సినిమాకు బాణీలు అందిస్తున్నారు. ఐరా నుంచి వస్తోన్న మూడో సినిమా ఇది. ఈ సినిమా పూజా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలి సన్నివేశానికి దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ కొట్టారు. తన సొంత నిర్మాణ సంస్థలో కొత్త ప్రాజెక్టును ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా నాగశౌర్య ట్వీట్ చేశారు.

నర్తనశాల తర్వాత నాగశౌర్య ఓ బేబీ సినిమాలో నటిస్తున్నారు. సమంత కథానాయికగా పాత్ర పోషిస్తున్నారు. నందినిరెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మిక్కీ జే మేయర్ బాణీలు అందిస్తున్నారు. లక్ష్మి, రావు రమేశ్, ఊర్వశి, రాజేంద్ర ప్రసాద్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## మెగా హీరో కోసం నాని..





మెగా కుటుంబానికి చెందిన హీరో అల్లు శిరీష్ కోసం కథానాయకుడు నాని అతిథిగా రాబోతున్నారు. శిరీష్ నటించిన సినిమా ఏబీసీడీ. అమెరికన్ బార్న్ కన్‌ఫ్యూజ్డ్ దేశీ అన్నది ఉపశీర్షిక. రుక్సార్ కథానాయిక. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించారు. నాగబాబు, కోటా శ్రీనివాసరావు, శుభలేఖ సుధాకర్, రాజా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం మే 17న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మలయాళ సినిమాకు తెలుగు రీమేక్‌గా దీన్ని తెరకెక్కించారు. 2017 ఒక్క క్షణం తర్వాత శిరీష్ నటించిన చిత్రమిది.

ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు నాని హాజరు కాబోతున్నారట. ఈ విషయాన్ని శిరీష్ ట్విటర్ వేదికగా తెలుపుతూ.. అతిథిగా రావడానికి ఒప్పుకున్న నేచురల్ స్టార్‌కు ధన్యవాదాలు చెప్పారు. మే 13న సాయంత్రం 7 గంటలకు జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ వేడుక ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

## అవినీతి కేసులో శ్రీలంక క్రికెట్ అనలిస్ట్ సస్పెండ్

దుబాయ్: ఐసీసీ అవినీతి నిరోధక చట్టాన్ని ఉల్లంఘించినందుకు శ్రీలంక క్రికెట్ అనలిస్ట్ సనత్ జయసుందరని ఐసీసీ సస్పెండ్ చేసింది. ఉన్నపళంగా అతన్ని విధుల నుంచి తొలగించాలని లంక క్రికెట్ బోర్డును ఆదేశించింది. అంతేకాక.. 14 రోజుల్లోగా అతను ఐసీసీకి వివరణ ఇవ్వాలని తెలిపింది. ఐసీసీ అవినీతి నిరోధక చట్టం ఆర్టికల్ 2.1.3 లంచం ఇచ్చేందుకు ప్రయత్నించడం, 2.1.1 ఏదో విధంగా అంతర్జాతీయ మ్యాచ్ ఫలితాన్ని, లేదా పురోగతిని ఆపాలని ప్రయత్నించడం, 2.1.7 యాంటీ కరప్షన్ యూనిట్(ఏసీయూ) విచారణని తిరస్కరించడం లేదా హాజరుకాకపోవడంల ప్రకారం అతనికి ఈ శిక్షపడింది.

## నా ప్రియుడు ఎవరో చెప్పండి

### నటి ఐశ్వర్య రాజేష్



కోలీవుడ్‌లో నటిగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు ఐశ్వర్య రాజేష్. ఆమె పలు తెలుగు సినిమాల్లోనూ నటిస్తున్నారు. కాగా ఐశ్వర్య ఓ వ్యక్తిని ప్రేమిస్తున్నారని, ఈ ఏడాదిలో వీరి వివాహం జరగబోతోందని కొన్ని రోజుల క్రితం వదంతులు వచ్చాయి. తన సినిమాలో సహ నటుడి పాత్ర పోషించిన వ్యక్తితో ఆమె డేటింగ్‌లో ఉందని రాసుకొచ్చారు. అయితే ఈ వార్తలపై ఐశ్వర్య స్పష్టత ఇచ్చారు. నా ప్రియుడు ఎవరో కాస్త చెప్పండి అని ట్వీట్ చేశారు. నా ప్రేమ కథ గురించి కొన్ని వదంతులు విన్నాను. దయచేసి నా ప్రియుడు ఎవరో కాస్త చెబుతారా.. తెలుసుకోవాలని నాకు చాలా ఆతృతగా ఉంది. ఇలాంటి తప్పుడు వార్తల్ని ప్రచారం చేయడం దయచేసి ఆపండి. ఏదైనా జరిగితే ముందు నేనే మీకు చెబుతా.

నేను సింగిల్‌గా సంతోషంగా ఉన్నా అని ఆమె ట్వీట్ చేశారు.

## పెద్ద హిట్ చేశారు.. ధన్యవాదాలు : మహేశ్



అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు మహర్షి సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేశారు. ఇప్పటి వరకు నా ప్రయాణం చాలా ప్రత్యేకంగా జరిగింది. నా 25వ సినిమాను.. నా కెరీర్‌లో బిగ్ హిట్ చేసినందుకు ధన్యవాదాలు. సినిమాను ఎంతో ఆదరించిన నా అభిమానులకు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన మీకు నా తరఫున, మహర్షి చిత్ర బృందం, దర్శకుడు వంశీ పైడిపల్లి తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు అని మహేశ్ పోస్ట్ చేశారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వేడుకలు ఏర్పాటు చేశారు. మహేశ్, వంశీ కుటుంబాలు మహర్షి సక్సెస్‌ను ఆనందంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను నమ్రత సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. మహర్షి హిట్ కావడానికి కారణమైన వంశీకి ఆమె ధన్యవాదాలు చెప్పారు. సక్సెస్ అనేది గమ్యం కాదు.. అది ఓ ప్రయాణం అంటూ మహర్షి సినిమా డైలాగ్‌ను కూడా రాశారు.







## గీతం వర్సిటీ మొదటి దశ
# ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ పూర్తి



సాగర్‌నగర్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కోర్సులలో ప్రవేశానికి గాను గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. గీతం ప్రవేశ పరీక్షలలో విద్యార్ధలకు లభించిన ర్యాంకుల ఆధారంగా మొదటి దశలో దాదాపు రెండు వేల మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు.

ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణత సాధించినప్పటికీ ఇంటర్‌లో మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకుని వివిధ కోర్సులలో ప్రవేశం ఇవ్వడంతో 60శాతం మార్కుల కంటే తక్కువగా ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రవేశం లభించలేదు. ఇంజనీరింగ్‌తో పాటు బిఫార్మశీ, బిఆర్క్ కోర్సులలోను అడ్మిషన్లు నిర్వహించారు.

**టిసిఎస్ కోర్సు పై విద్యార్థుల ఆసక్తి:**

ప్రముఖ ఐటి దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) స్వయంగా రూపొందించిన కంప్యూటర్ సైన్స్ బిజినెస్ సిస్టమ్స్ (సిఎస్‌బిఎస్) కోర్సులో ప్రవేశానికి విద్యార్థులు ఆసక్తి కనబరిచారు.పరిమిత సంఖ్యలో సీట్లు ఉండటంతో ఈ ఏడాది 60 మందికి మాత్రమే ప్రవేశం కల్పించారు.మూడు రోజుల పాటు జరిగిన ఈ ఇంజనీరింగ్,ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కౌన్సిలింగ్‌లో అధిక శాతం విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి ప్రాధాన్యత నివ్వడం కనిపించింది. ఇసిఇ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులు తరువాత ప్రాధాన్యతా క్రమంలో నిలిచాయి.

ఎంసెట్, జెఈఈ మెయిన్ ర్యాంకర్లకు ఫీజులలో ఈ ఏడాది నుంచి ప్రతిభా స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని నిర్ణయించిన నేపద్యంలో ఎంసెట్ ఫలితాలు వెలువడిన అనంతరం మే చివరి వారంలో రెండవ దశ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కాగా అడ్మిషన్ల ప్రక్రియను గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఎన్.వి.ఎస్. వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

## ఒరాఫో వారి మాతృ దినోత్సవ
# ప్రత్యేక కలెక్షన్



విశాఖపట్నం: ఒరాఫో శనివారం తమ ఖాతాదారులు, అతిధులు, ప్రముఖ సెలబ్రిటీ తల్లులు సమక్షంలో మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినది.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, మాలిని, లావణ్య (మిసెస్ వైజాగ్), బిందు (శ్రీమతి సిల్క్ మార్క్ విజేత), డాక్టర్ పల్లవి ఇంకనూ విశాఖ నగరం లోని అనేకమంది విశిష్ట విశిష్ట మహిళలు పాల్గొన్నారు,

ఈ సందర్భంగా ఒరాఫో తమ నూతన మదర్స్ కలెక్షన్ 92.5 స్టెర్లింగ్ వెండి ఆభరణాలు ఆవిష్కరించారు. స్టెరింగ్ సిల్వర్ అత్యంత అందమైన మరియు ఆకర్షణీయమైన మెరిసే విలువైన లోహం. భారతీయ మహిళలు అలంకరించుకునే ఈ ఆభరణాలు అనేక నమూనాలు మరియు రకాలులో లభిస్తాయి. గత అనేక దశాబ్దాలుగా బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి మరియు దీనితో ఆభరణాల ప్రియులు తమ కోరికలకు వెనుకడుగు వేస్తున్నారు.

కనకనే ఒరాఫో అన్ని వయో వర్గాల భారతీయ మహిళలు మరియు సామాజిక వర్గాల వారి ఆకాంక్షలు వేరవేర్చుట కొరకు తాము కోరుకునే ఆభరణాలను 52.5 స్టెర్లింగ్ వెండి ఆభరణాలు రూపంలో ప్రవేశపెట్టినది. టెంపుల్ ఆభరణాలు, విలువైన రాళ్ళ ఆభరణాలు, సిజెడ్ పొదిగిన ఆభరణాలు, ఇంపోర్టెడ్ సిల్వర్ క్యాజువల్ వేర్ వంటి పలురకాలైన ఆభరణాలు ప్రత్యేకించి 92.5 స్టెర్లింగ్ వెండి ఆభరణాలనందు ఒరాఫో సమర్పిస్తుంది. వీటికి అదనంగా మెన్స్ కలెక్షన్ మరియు కిడ్స్ కలెక్షన్ అందిస్తుంది. అంతేకాక అన్ని వర్గాల వారి బడ్జెట్‌నకు సరిపోయే ప్రత్యేక బ్రైడల్ (వివాహ) కలెక్షన్స్ అందించుటలో ఒరాఫో ప్రత్యేకత కలిగి వుంది.

ఇవన్నీ ఒరాఫో తొలిసారిగా తన ఖాతాదారులకు తిరిగి కొనుగోలు విలువ (బై బ్యాక్ వాల్యూ) మరియు జీవిత కాల ఉచిత సర్వీసుతో తమ అన్ని స్టెర్లింగ్ వెండి ఆధరణాలు అందిస్తున్నాది, ఒరాపో మహిళలు ఆశించే కోరికలు మేరకు బంగారు మరియు వజ్రాభరణాలు తయారీ తక్కువ తరుగుదలతో సరసమైన ధరలకు అందించుట కొనసాగిస్తున్నది.

ఖాతాదారులు మా డిజైన్ బ్యాంకు నుండి తమకు నచ్చిన డిజైన్ ఎంపిక చేసుకోవచ్చునని, దానిని నిర్ణీత సమయం లోగా బిఐఎస్ హాల్ మార్క్ మరియు వజ్రాలు అంతర్జాతీయ ధృవీకరణ తో అందిస్తాము అన్నారు. వివాహాది మరియు ఇతర శుభకార్యాలకు రిటర్న్ గిఫ్ట్ గా బంగారు మరియు వెండి పూత బహుకరణలు విస్తృత శ్రేణిలో అందిస్తుంది,

విలువైన ఖాతాదారులకు సంప్రదాయ జ్యుయలరీ కొనుగోలు యొక్క నూతన ఒరవడి ఫ్లాగ్ షిప్ బోటిక్ ను ఒరాఫో విశాఖపట్నంలో టెంపనీ స్కూలు గేటు-సి ఎదుట, సిబిఎం కాంపౌండ్ నందు ప్రారంభించినది. మరిన్ని వివరములకు ఫోన్ నెం. 9014723303/ 9014723304లో సంప్రదించవచ్చును.



రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో 11 మే 1998లో జరిగిన విజయవంతమైన ఆపరేషన్ శక్తి (పోఖ్రాన్-2) దినోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ టెక్నాలజీ డేను ఎన్ఎస్‌టిఎల్ & డిఆర్‌డిఓలు నిర్వహించాయి. విశాఖపట్నంలోని మానసి ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగుళూరు చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ మరియు డాక్టర్ సమీర్ వికామత్, నేవల్ సిస్టమ్స్ & మెటీరియల్స్ సైంటిస్ట్ & డైరెక్టర్ జనరల్ ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ & సైంటిస్ట్ డాక్టర్ ఓ.ఆర్. నందగోపాల్ మరియు ఎన్‌టిడిసి-2019 చైర్మన్ మరియు సైంటిస్ట్ ఎఫ్ వి, రామమోహనరావు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారందరూ సాంకేతికతకు సృజనను జోడించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు మన దేశం సాధించాలని అన్నారు.

## తెరాస మాజీ ఎమ్మెల్యే
# కనకారెడ్డి కన్నుమూత



హైదరాబాద్: మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే, తెరాస నేత చింతల కనకారెడ్డి కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. 2014- 18 మధ్య మల్కాజ్‌గిరి నుంచి తెరాస ఎమ్మెల్యేగా కనకారెడ్డి పనిచేశారు. రైతు కుటుంబానికి చెందిన కనకారెడ్డి ద్రాక్ష రైతుల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రజా రాజ్యం పార్టీ తరపున 2009 మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తర్వాత కొన్ని రోజుల పాటు తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. ఆ తర్వాత 2014లో తెలంగాణ రాష్ట్ర సమితి తరపున బరిలోకి దిగి విజయం సాధించారు.

**సీఎం కేసీఆర్ సహా పలువురి సంతాపం**

మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి మరణం పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కనకారెడ్డి మృతిపై మంత్రి ఈటల రాజేందర్ సంతాపం వ్యక్తంచేశారు. కిమ్స్ ఆస్పత్రిలో ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అలాగే, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసభాపతి పద్మారావు గౌడ్, మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

# సత్యదేవుని కళ్యాణ ఏర్పాట్లపై ఆర్డీవో సమావేశం

అన్నవరం : (తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరజిల్లుతూ భక్తుల పాలిట కొంగుబంగారంగా పూజలందుకుంటున్నా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈ నేల 14 తేది నుండి 19వ తేది వరకు జరుగు శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దివ్య కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లపై రత్నగిరి కొండపై అర్.డి.ఓ వసంత రాయుడు గారు మరియు దేవస్థానం ఈఓ ఎమ్.వి సురేష్ బాబు సమక్షంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అర్.డి.ఓ మాట్లాడుతూ రెవెన్యూ,పోలీసు,దేవాదాయ శాఖ మరియు ఇతర శాఖల సమన్వయంతో భక్తిశ్రద్ధలతో శ్రీ స్వామి వారి కళ్యాణం వీక్షించడనికి వచ్చే భక్తులకు గతంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మలికర్జున్ తీసుకున్న అంశాల ఆధారంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్టీవో తెలిపారు. ఈనెల 15వ తేదీన జరగబోయే శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవంనాకు కొండపైకి ఆటోలు అనుమతించడం జరగదని. భక్తులకు అనుగుణంగా 10 ఉచిత బస్సులను కొండపై



నుంచి కొండ కిందకు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే లైటింగ్,శానిటేషన్, త్రాగునీరు,వాహన పార్కింగ్,కంట్రోల్ రూమ్,కళ్యాణ వేదిక,తలంబ్రలు,వి.ఐ.పి,మీడియా,దేవస్థానం సిబ్బందికి ప్రత్యేఖ పాసులు ఏర్పాటు చేశామని, స్వామివారి గ్రామోత్సవంలో వాకి టాకీలు, భారీగేట్ లకు సంబంధించి అన్ని అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగిందని అన్నారు. అన్ని ఏర్పాట్లకు సంబంధించి నిర్ణయించిన సిబ్బంది నిధులపై పర్యవేక్షణ అధికారులను నియమించాలని ఆర్డీవో ఈఓ నుకోరారు.

ఈ సందర్భంగా ఈవో సురేష్ బాబు మాట్లాడుతూ సత్య దేవుని కళ్యాణ మహోత్సవములు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశామని, స్వామివారి కల్యాణానికి సుమారు 65 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులు పోలీసులు ఇతర శాఖ అధికారులు భక్తులు స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ జగన్నాధ రావు మరియు పీ ఆర్ ఓ తులా రాము మరియు డి ఈ నూకరత్నం దేవస్థానం అధికారులు మరియు తాసిల్దారు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐపీఎల్ ఫైనల్‌కు భారీ బందోబస్తు

- 300 సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

రాచకొండ సీపీ మహేశ్ భగవత్



హైదరాబాద్ : నగరంలోని ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు పూర్తి బందోబస్తు కల్పించినట్లు రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ వెల్లడించారు. ఆదివారం రాత్రి 7గంటల 30నిమిషాలకు ముంబై, చెన్నై జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టేడియం లోపల పరిసరాలతో 300సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సీపీ చెప్పారు.

స్టేడియం లోపల ఒక ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. మొత్తంగా 2800 పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నారని సీపీ తెలిపారు. స్టేడియం, పిచ్‌ను ఇప్పటికే తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. నిషేధిత వస్తువులు తీసుకురావద్దని క్రికెట్ అభిమానులకు సూచించారు. హెల్మెట్, పవర్ బ్యాంక్, సిగరెట్లు, లాప్‌ట్యాప్, మద్యం, తినే పదార్థాలు బయట నుంచి నీళ్ల డబ్బాలను అనుమతించమని చెప్పారు.

# రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

## ప్రయాణీకులంతా సురక్షితం

భువనేశ్వర్ : ఢిల్లీ - భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయి. ఒడిశాలోని బాలాసోర్ జిల్లా ఖంటపడ రైల్వే స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. రైలు చివరి పెట్టె అయిన జనరేటర్ బోగిలో మంటలు చెలరేగాయి. దీన్ని గుర్తించిన సిబ్బంది వెంటనే ఆ బోగిని వేరు చేసి మంటలను అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రయాణికులేవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు.

గత నెలలో ఇదే రైలులో కలుషిత ఆహారం తిని 20 మంది అస్వస్థతతకు గురయిన సంగతి తెలిసిందే. దాంతో అప్పటికప్పుడు రైలును బొకారో రైల్వే స్టేషన్‌లో ఆపి అస్వస్థతకు గురైన ప్రయాణికులకు చికిత్స అందించారు.

## రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో
# సత్తా సాటాలి



విజయనగరం : విశాఖపట్నంలో ఈ నెల 26,27 తేదీలలో జరగనున్నరాష్ట్రస్థాయి ఈత పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని సత్తా చాటాలని ఒలింపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్. వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. జిల్లా జట్టుకు సుమారు 20మంది ఎంపికయ్యారని శిక్షకులు పి.అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరో దశ ఎన్నికలకు సర్వం సిద్ధం!

ఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా ఆరో దశ ఎన్నికల పోలింగ్ ఆదివారం జరగనుంది. మొత్తం ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 59 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ దశలో ఎన్నికలు జరగనున్నాయి.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com